పిక్నిక్‌కు వెళదాం పదండి..
» జిల్లాలో ఎన్నో అద్భుత సందర్శనీయ ప్రదేశాలు
» మదిని దోచే సముద్ర తీరాలు
» కార్తీక మాసంలో వనభోజనాలకు సందడే సందడి

·8లో

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు


నక్కపల్లి మండలం ఉపమాక శివాలయంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలకు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో కిటకిటలాడాయి. మహిళలు ధ్వజస్తంభాల వద్ద దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. సాయంత్రం చంద్రోదయం కాగానే ఇళ్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనకాపల్లి పట్టణంలోని సిద్ధిలింగేశ్వర, కాశీవిశ్వేశ్వర, ఉమారామలింగేశ్వర, భోగలింగేశ్వర ఆలయాల్లో శుక్రవారం రాత్రి జ్వాలా తోరణం వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు ఆలయాలకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



అనకాపల్లి సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలా తోరణం

సింహగిరిపై పుణ్య నదీ హారతి


వరాహ పుష్కరిణిలో పుణ్యనదీ హారతి ఇస్తున్న అర్చకులు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సింహాచలం కొండదిగువ వరాహ పుష్కరిణిలో పుణ్యనదీ హారతిని శుక్రవారం రాత్రి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అంతకుముందు సింహాచల దేవస్థానం ఉపాలయం పద్మావతి, అలిమేంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు.

వీవోఏ అవినీతి లెక్క తేల్చేశారు!

రూ.11.32 లక్షలు స్వాహా అయినట్టు ప్రాథమిక విచారణలో నిర్ధారణ

» డబ్బులు తిరిగి చెల్లించడానికి వీవోఏ అంగీకారం


చోడవరంలో వెలుగు కార్యాలయం

చోడవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింహాద్రిపురం పంచాయతీలో డ్వాక్రా సంఘాలకు చెందిన రుణాల సొమ్ము స్వాహా వ్యవహారాన్ని అధికారులు 'తేల్చే'శారు. సదరు వీవోఏ రూ.11.32 లక్షలు మాత్రమే స్వాహా చేసినట్టు ప్రాథమిక విచారణలో అధికారులు లెక్కలు తేల్చారు. తప్పు తనదేనని, ఆ సొమ్ములు చెల్లిస్తానని ఇందుకు బాధ్యురాలైన వీవోఏ వరలక్ష్మి.. అధికారుల ఎదుట అంగీకరించినట్టు చెబుతున్నారు.

మండలంలో సింహాద్రిపురం పంచాయతీకి చెందిన వెలుగు వీవోఏ వరలక్ష్మి.. పంచాయతీ కేంద్రంతోపాటు శివారు పాతిక గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళల పేరుతో సుమారు రూ.15 లక్షల రుణం మంజూరు చేయించి వాటిని వేరే ఖాతాలకు మళ్లించుకున్నది. అంతేకాక పలువురు డ్వాక్రా మహిళలు రుణ బకాయిల చెల్లింపు కోసం ఇచ్చిన డబ్బులను జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడింది. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన డ్వాక్రా సభ్యులు.. వెలుగు అధికారులకు ఫిర్యాదు చేసి, పోలీసులకు మౌఖికంగా సమాచారం ఇచ్చారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ డైసీ రెండు రోజుల క్రితం ఇక్కడకు వచ్చి విచారణ చేపట్టారు. ఎంతమేర డబ్బులు పక్కదారి పట్టాయన్న దానిపై సభ్యులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక ... మిగతా 8వ పేజీలో

ఇంటింటా సౌర వెలుగులు

పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాప్

» ఇంటి కప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలం ఉంటే చాలు..
» ఒక కిలోవాట్ సామర్థ్యం ఉండాలి
» యూనిట్ విలువలో రూ.30 వేలు సబ్సిడీ
» రెండు కిలోవాట్‌లు అయితే రూ.60 వేలు..
» మూడు, అంతకన్నా ఎక్కువ కిలోవాట్‌లకు రూ.78 వేలు రాయితీ
» మిగిలిన సొమ్ము బ్యాంకుల నుంచి రుణంగా పొందే వెసులుబాటు
» సామాన్యులపై భారీగా తగ్గనున్న కరెంటు బిల్లు భారం
» మిగులు విద్యుత్తుతో అదనపు ఆదాయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటా 'సౌర శక్తి' వెలుగులు ప్రకాశించనున్నాయి. ఇంటి పైకప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలోవాట్ సామర్థ్యంతో సౌర విద్యుదుత్పత్తి యూనిట్‌ను అమర్చుకోవచ్చు. సౌర విద్యుత్ ప్యానల్స్, ఇతర సామగ్రి విలువపై ఒకటి, రెండు కిలోవాట్‌లు అయితే 60 శాతం, మూడు కిలోవాట్‌లకు మించితే 40 శాతం రాయితీని ప్రభుత్వం ఇస్తున్నది. లబ్ధిదారులు తమ వాటా సొమ్మును బ్యాంకుల నుంచి రుణంగా పొందే వెసులుబాటు కూడా వుంది.

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు ఎడాపెడా పెంచడమే కాకుండా సౌర విద్యుత్తును అందుబాటులో తేవడంలో పూర్తి నిర్లక్ష్యం వహించింది. దీంతో విద్యుత్ వినియోగదారులపై మరో ఏడాదిన్నర వరకు చార్జీల సర్దుబాటు పేరుతో అదనపు భారం తప్పేటట్టు లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివాస గృహాలపై సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు శ్రీకారం చుట్టింది. విద్యుత్ వినియోగ చార్జీల భారాన్ని తగ్గించే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'పీఎం సూర్య ఘర్' పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించాయి. దీనివల్ల తక్కువ ఖర్చుతో దీర్ఘ కాలంపాటు విద్యుత్తును పొందవచ్చు. సౌర విద్యుత్ పరికరాల వ్యయంలో కొంతమొత్తాన్ని ప్రభుత్వాలు రాయితీగా ఇస్తున్నాయి. ఉత్పత్తి అయిన విద్యుత్ కన్నా, గృహ వినియోగం తక్కువగా వుంటే.. అదనపు విద్యుత్‌ను డిస్కమ్‌లు తీసుకుని, వినియోగదారునికి డబ్బులు చెల్లిస్తాయి. దీనివల్ల అదనపు ఆదాయం పొందే అవకాశం వుంది.



పీఎం సూర్యఘర్ పథకం కింద అనకాపల్లి మండలంలో ఒక ఇంటిపై అమర్చిన సోలార్ ప్యానల్స్

పరికరాల వ్యయంపై 40-60 శాతం రాయితీ

ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్‌ను అమర్చుకోవాలంటే ఇంటి పైకప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలం వుండాలి. ఒక కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్స్‌కు అయితే రూ.60 వేలు, మూడు కిలోవాట్స్ అంతకాన్న ఎక్కువ వుంటే రూ.78 వేలు రాయితీగా ప్రభుత్వం అందిస్తుంది. ఉదాహరణకు మూడు కిలోవాట్స్ సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోడానికి రూ.1.5 లక్షలు ఖర్చు అయితే అందులో రూ.78 వేలు కేంద్ర ప్రభుత్వం రాయితీగా అందిస్తుంది. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణంగా పొందవచ్చు. నెలకు 150 యూనిట్లకు లోబడి విద్యుత్ వినియోగించే వారికి ఒకటి ... మిగతా 8వ పేజీలో

ఉత్సాహంగా ఫణిగిరి ప్రదక్షిణ

భక్తుల శివనామస్మరణతో మార్మోగిన పంచదార్ల

» గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు


ఫణిగిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


ఉమాధర్మలిగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పురోహితులు.

రాంబిల్లి, నంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం పంచదార్ల శుక్రవారం శివనామ స్మరణతో మార్మోగింది. హరహర మహాదేవ... శంభో శంకర అంటూ భక్తులు ఉత్సాహంగా ఫణిగిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఉమాధర్మలింగేశ్వరస్వామి ఫణిగిరి ప్రదక్షిణం కార్యక్రమం విజయవంతమైయింది. తొలిసారి నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణకు స్థానికులతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు. తొలుత పంచదార్ల పుణ్యక్షేత్రంలో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ఉమాధర్మలింగేశ్వరస్వామి ఫణిగిరి ప్రదక్షిణను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం. వేలాది మంది భక్తులు శివనామ స్మరణ జపిస్తూ పంచదార్ల నుంచి కొత్తూరు, గోకివాడ, మూలజంప, మడకపాలెం, చర్లోపాలెం, నరేంద్రపురం, మల్లవరం, ఉప్పవరం, యర్రవరం, కొండకర్ల, చోడపల్లి, అచ్యుతాపురం, వెదురువాడ, గొర్లెధర్మవరం, వెంకటాపురం జంక్షన్, ధార భోగాపురం, ధారంపాలెం మీదుగా తిరిగి పంచదార్ల చేరుకున్నారు. మొత్తం 24 కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ సాగింది. అనంతరం ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించి, ఫణిగిరిపై ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. గిరిప్రదక్షిణ మార్గంలో ఆయా గ్రామాల వారు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందజేశారు. రాంబిల్లి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డి.రంగనాయకులు, వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, భైలపూడి రామదాసు, ఆలయ కమిటీ చైర్మన్ సుందరపు లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముద్దాయిలకు పదేళ్ల జైలు శిక్ష

» ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా
» ... చెల్లించని పక్షంలో మరో రెండున్నరేళ్లు కారాగారం

చోడవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఐదుగురు ముద్దాయిలకు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎ.రత్నకుమార్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. చీడికాడ మండలం భైలపూడి గ్రామానికి చెందిన జాజిమొగ్గల సంతోష్, వద్దాది రమణ, అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం కిముడుపల్లికి చెందిన సీదరి సుబ్బారావు, చింతాడ లక్ష్మయ్య, కొర్రా బాబూరావులు 2015 ఫిబ్రవరి 16వ తేదీన 120 కిలోల గంజాయి రవాణా చేస్తూ చీడికాడ పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పట్లో వీరిపై ఎస్ఐ విశ్వనాథం కేసు నమోదు చేశారు. నిందితులపై మోపిన నేరం రుజువుకావడంతో జడ్జి రతన్నకుమార్ ముద్దాయిలందరికీ పదేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండున్నర సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాలని జడ్జి పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉగ్గిన వెంకటరావు వాదించారు.

బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయానికి మహర్దశ

» అన్నవరం దేవస్థానం దత్తత
» ఫలించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషి


బలిఘట్టంలో సత్యనారాయణ స్వామి ఆలయం

నర్సీపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం ఉత్తర వాహిని సమీపంలోని సత్యనారాయణస్వామి ఆలయాన్ని అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం దత్తత తీసుకున్నట్టు స్పీకర్ అయ్యన్నపాత్రుడు క్యాంప్ ఆఫీసు నుంచి అధికారంగా తెలిసింది. దీనికి సంబంధించి దేవదాయ శాఖ నుంచి అధికారికంగా ప్రకటన వెలువడాల్సి వుంది.

పూర్వం కాలంలో సత్యనారాయణస్వామి ఆలయం వరహా నది అవతల వైపు ఉండేది. కాల క్రమేణా ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.45 లక్షలతో సత్యనారాయణస్వామి ఆలయాన్ని పునర్నిర్మించింది. నాడు మంత్రిగా వున్న అయ్యన్నపాత్రుడు సుమారు రూ.75 లక్షలతో ఆలయాన్ని అనుకొని కల్యాణ మండపం నిర్మించడానికి కృషి చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టించుకోక పోవడంతో నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండి పోయాయి. ఆలయానికి బలిఘట్టం, గుండుపాలలో వున్న భూముల కౌలు ద్వారా ఏటా రూ.50 వేల ఆదాయం మాత్రమే వస్తున్నది.. హుండీ ఆదాయం మరో రూ.30 వేలు వుంటుంది. ఆలయానికి ఆదాయం అంతంత మాత్రంగానే ఉండడంతో ధార్మిక కార్యక్రమాలు నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారు.

బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయాన్ని అన్నవరం దేవస్థానం దత్తత తీసుకుంటే అభివృద్ధి జరుగుతుందన్న ఉద్దేశంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు దేవదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసకువెళ్లారు. బలిఘట్టం ఆలయం స్థితిగతులు, ఆదాయ వివరాలను దేవదాయ శాఖ ఉన్నతాధికారులు కోరడంతో స్థానిక కార్యనిర్వహణాధికారి ఇరవై రోజుల క్రితం పంపించారు. అన్నవరం దేవస్థానం దత్తత ప్రక్రియ పూర్తి అయినట్టు స్పీకర్ క్యాంప్ ఆఫీసు నుంచి అధికారికంగా స్థానిక మీడియాకు తెలియజేశారు.

ఎమ్మెల్యేల లిక్కర్ దందా!

మద్యం వ్యాపారులకు ఇండెంట్లు

» దుకాణాల్లో వాటా అడుగుతున్న ఒక ఎమ్మెల్యే
» దుకాణానికి రూ.పది లక్షలు గుడ్ విల్ ఇవ్వాలని మరో ప్రజా ప్రతినిధి డిమాండ్
» తనను కలవని వారికి లైసెన్స్ ఇవ్వొద్దని ఎక్సైజ్ అధికారులకు మరో ఎమ్మెల్యే ఆదేశాలు
» లాటరీలో దక్కించుకున్న వారి వద్ద నుంచి మూడు దుకాణాలు చేజిక్కించుకున్న మరో ఎమ్మెల్యే
» ఆ దుకాణాల పరిసరాల్లో మరే దుకాణానికి లైసెన్స్ ఇవ్వకుండా మోకాలడ్డు
» నిబంధనలకు విరుద్ధంగా కొన్నిచోట్ల దుకాణాలు ఏర్పాటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మద్యం వ్యాపారంలో కొంతమంది ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుంటున్నారు. దుకాణాల్లో వాటా ఒకరు డిమాండ్ చేస్తే, మరొకరు...ప్రతి దుకాణం నుంచి గుడ్‌విల్ పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. బినామీ పేర్లతో తాము దక్కించుకున్న దుకాణాల పరిసరాల్లో మరొక దుకాణం ఏర్పాటుకాకుండా ఇంకొందరు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.

మద్యం వ్యాపారంలో ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవద్దని సీఎం చంద్రబాబునాయుడు స్పష్టంగా ఆదేశించినా ఉమ్మడి జిల్లాలో కొంతమంది పెడచెవిన పెడుతున్నారు. తాము ప్రత్యక్షంగా సీన్‌లోకి రాకుండా తమ అనుచరులు, ఎక్సైజ్ శాఖలోని అస్మదీయులైన అధికారుల ద్వారా చక్రం తిప్పుతున్నారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని ఒక ప్రజా ప్రతినిధి తన నియోజకవర్గంలో ఉన్న మద్యం దుకాణాల నుంచి గుడ్‌విల్ కింద కొంత మొత్తం వసూలు చేయాలంటూ అనుచరుడి ద్వారా ఎక్సైజ్ అధికారికి ఇండెంట్ పెట్టించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు నియోజకవర్గంలోని ఒక్కో దుకాణం నుంచి రూ.పది లక్షలు చొప్పున వసూలు చేసి ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. రెండు రోజుల కిందట జరిగిన ఎక్సైజ్ శాఖ సమావేశంలో ఈ విషయాన్ని ... మిగతా 8వ పేజీలో



విశాఖలో మద్యం దుకాణం కోసం ఫుట్‌పాత్‌పై మెట్ల నిర్మాణం

పూడిమడక తీరానికి మృత తాబేళ్లు



ఒడ్డుకు కొట్టుకు వచ్చిన మృత తాబేళ్లను పరిశీలిస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం/అచ్యుతాపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక సముద్ర తీరానికి రెండు భారీ మృత తాబేళ్ల శుక్రవారం కొట్టుకువచ్చాయి. చేపల వేటకు వెళ్లి తిరిగి పూడిమడక తీరానికి చేరుకున్న మత్స్యకారులకు ఇవి కనిపించాయి. సమీపంలోని కంపెనీల వ్యర్థాలు సముద్రంలోకి కలిపి వేయడం కారణంగా నీరు కలుషితమై మత్స్య సంపద చనిపోతున్నాయని మత్స్యకారుడు చేపల తాత ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ మృతి చెందిన చేపలు, తాబేళ్లు ఒడ్డుకు కొట్టుకురావడం వల్ల చేపల వేట ఆధారంగా జీవిస్తున్న తాము ఆందోళనకు గురవుతున్నామని వాపోయారు. దీనిపై అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని పలువురు మత్స్యకారులతో కలిసి ఆయన డిమాండ్ చేశారు.

సమస్యలపై అధికారులకు 108 సిబ్బంది వినతులు



తహసీల్దార్ వరహాలుకు వినతి పత్రం అందిస్తున్న సిబ్బంది

ఎలమంచిలి, నంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ వరహాలు, ఎంపీడీవో కొండలరావులకు 108 సిబ్బంది శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని, ఎరియర్స్‌తో కలిసి పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు చెల్లించాలని, దీర్ఘకాలంగా తాము అందిస్తున్న సేవలను గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు.



అమ్మవారి భక్తులను గుడి వద్దకు తీసుకువస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్



వేడుకల్లో ఆకట్టుకున్న కాళీమాత వేషధారణలు

ఘనంగా గుమ్మడి అమ్మలు పేరంటాల ఉత్సవం

» రెండు రోజుల పాటు విశేష పూజలు » అమ్మవారి సేవలో ఎమ్మెల్యే 'సుందరపు' » పెద్ద సంఖ్యలో భక్తులు రాక

రాంబిల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు గ్రామంలో జరుగుతున్న గుమ్మడి అమ్మలు పేరంటాల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కుటుంబ సభ్యుల ఆరాధ్య దేవత అయిన ఈ అమ్మవారి దర్శనానికి రెండు రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. పసుపు, కుంకుమ, చీరలు వంటివి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే విజయకుమార్, జనసేన పార్టీ రాష్ట్ర నేత సుందరపు సతీష్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, జనసేన పార్టీ రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల శాఖల అధ్యక్షులు బైలపూడి రామదాసు, పప్పల నూకన్నదొర తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయం వద్ద దర్శనానికి బారులుతీరిన భక్తులు

'సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి'

గొలుగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ సూచించారు. కృష్ణాదేవిపేట కళాశాలలో సైబర్ నేరాలపై శుక్రవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు.

'పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన'



గ్రంథాల ఉద్యమకారులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళి

అచ్యుతాపురం రూరల్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఇక్కడి గ్రంథాలయంలో ఉపాధ్యాయులతో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. తొలుత గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల సర్వోత్తమరావు వంటి వారి చిత్రపటాలకు వక్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు చదవడం వల్ల ప్రయోజనాలను వివరించారు. ఉపాధ్యాయులు మారిశెట్టి వెంకట అప్పారావు, దొని నూకరాజు, లాలం ప్రసాద్, గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫణిగిరి ప్రదక్షిణ దృశ్య మాలిక



ఫణిగిరి ప్రదక్షిణ సందర్భంగా ముందుకు సాగుతున్న ప్రచార రథం



రాంబిల్లి మండలం పంచదార్ల పుణ్యక్షేత్రం వద్ద భక్తుల సందడి

ప్రజా సమస్యలపై సీపీఎం ధర్నా



టీడీకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ప్రజా సమస్యలపై ప్రజాపోరులో భాగంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై ప్రజలకు సరకులు అందించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రొంగలి రాము, కర్రి అప్పారావు, ఆర్.శంకరరావు, కె.సోమినాయుడు, చేపల తాతయ్య, రామునాయుడు, బి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై ఆర్థిక భారాలు తగదు

రాంబిల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై ఆర్థిక భారాలు మోపడం ప్రభుత్వాలకు తగదని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు అన్నారు. ప్రజాపోరులో భాగంగా ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, విద్యుత్ చార్జీల భారం ప్రజలపై వేయకుండా ప్రభుత్వమ భరించాలని గ్రామాల్లో సాగులో ఉన్న పేదరైతులకు భూముల పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నారాయణరావు, రామకృష్ణ, కాశియ్య, గంగరాజు, అప్పారావు, లోవరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎన్‌పీసీఐ సర్వే

పాయకరావుపేట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి జియో ట్యాగింగ్, ఎన్‌పీసీఐ సర్వేను శుక్రవారం ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు పరిశీలించారు. పాల్తేరు, ఈదటం, పాల్మన్‌పేట, వెంకటనగరం, కుమారపురం, శ్రీరాంపురం, మంగవరం, గుంటపల్లి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి సర్వే సిబ్బందినుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. పాల్తేరులో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. ఉపాధి పనులను పక్కాగా చేపట్టాలని కూలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీసీహెచ్.చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలోకి సుంకపూర్ వైసీపీ నాయకులు



మంత్రి అనిత సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ సీనియర్ నాయకులు

కోటవురట్ల, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకపూర్ గ్రామానికి చెందిన పలువురు వైసీపీ సీనియర్ నాయకులు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. శుక్రవారం విజయవాడలో హోంమంత్రి వంగలపూడి అనిత నివాసంలో టీడీపీ మండల అధ్యక్షుడు జానకీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీరంతా ఆ పార్టీలో చేరారు. మంత్రి అనిత కండువాలతో వారిని ఆహ్వానించారు. ఆ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ చింతకాయల బాపన్నానాయుడు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ, వార్డుమెంబర్ దేవుడు, మాజీ విద్యాకమిటీ ఛైర్మన్ జోగేశ్వరరావు, పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ మాజీ చిటికెల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలు అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న జిల్లా సహకార సంఘాల విద్యా అధికారి సోమేశ్వరరావు

పాయకరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా సహకార సంఘాలు అభివృద్ధి చెందాలని అనకాపల్లి జిల్లా సహకార సంఘాల విద్యా అధికారి జి. సోమేశ్వరరావు అన్నారు. 71వ అఖిల భారత సహకార సంఘాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకమన్నారు. సహకార సంఘాల ద్వారా కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం ద్వారా వ్యవస్థ పురోగతి సాధ్యమవుతుందన్నారు. సహకార సంఘాల ద్వారా వ్యవసాయ రుణాలు మంజూరుతోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్టు, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహకార సంఘాల అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ పి. నాగభూషణంతోపాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

చీడికలో గిరిజన గౌరవ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నక్కపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిక గిరిజన గ్రామంలో భగవాన్ బిర్సా ముండా (ఆర్‌జీఎస్‌ఏ) జయంతి సందర్భంగా గిరిజన గౌరవ దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య పథకంలో భాగంగా ఎంపీడీవో సీతారామరాజు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. గిరిజనులకు బిర్సా ముండా ఆయన చేసిన సేవలను వివరించారు. గిరిజన సంక్షేమానికి, గిరిజన గ్రామాలభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలుచేస్తున్నట్టు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.





ఎలమంచిలిలో నిషేధిత పాలిథిన్ కవర్లలో సరకులు తీసుకువెళ్తున్న జనాలు



ప్లాస్టిక్ కవర్లలో సిద్ధంచేసిన కూరగాయలు

మూన్నాళ్ల ముచ్చటగా పాలిథిన్ నిషేధం

» ఎలమంచిలిలో యథేచ్ఛగా విక్రయాలు

» అధికారులు చర్యలు శూన్యం

» పరిసరాలు కలుషితం.. పొంచి ఉన్న ప్రాణాంతక వ్యాధుల భయం

ఎలమంచిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపాలిటీలో ప్లాస్టిక్ కవర్ల నిషేధం మున్నాళ్లముచ్చటగా మారింది. వీటిపై అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో పాలిథిన్ కవర్ల విక్రయాలు, వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. పాలిథిన్ కవర్ల వాడకంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. అలాగే, అనేక ప్రాణాంతక వ్యాధుల భయం పొంచి ఉంది. ఏడాది క్రితం మునిసిపల్ పాలకులు, అధికారులు పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత, స్వచ్ఛ ఎలమంచిలికి తోడ్పాటు నందించాలని ప్రచారం సాగించారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయించకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందుకు తగ్గట్టు ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై దాడులు చేసి పలువురు వ్యాపారులను కేసులు నమోదు చేశారు. దీంతోపాటు ప్రజల్లో కూడా వీటి వాడకంపై అవగాహన వచ్చి మార్కెట్లలో దుకాణాలకు వచ్చే సమయంలో ఇళ్లనుంచే నార, గుడ్డ సంచులను తెచ్చుకుని వినియోగించుకునేవారు. దీంతో కొంత వరకు పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలకు చెక్ పెట్టినట్లయింది. వ్యాపారులూ ప్లాస్టిక్ కవర్ల విక్రయాలను చాలా మేరకు తగ్గించారు. అయితే, తర్వాత అధికారులు పట్టించుకోక పోవడంతో మళ్లీ యథావిధిగా పాలిథిన్ కవర్ల విక్రయాలు జోరందుకున్నాయి. పట్టణంలోని ఏ దుకాణంలో చూసినా నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు సాగుతున్నాయి. వినియోగదారులు వీటి వాడకంవైపు మరలిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి నెలకొందని చెప్పవచ్చు. గతంలో వ్యాపారులు, వినియోగదారులు ప్లాస్టిక్ కవర్లను గుట్టు చప్పుడు కాకుండా వినియోగించేవారు. గత ఆరునెలలుగా మునిసిపల్ అధికారులు కనీసం దృష్టిసారించకపోడంతో గతంలో లేనంతగా పాలిథిన్ వాడకం పెరిగింది. అలాగే, మందుబాబులు ప్లాస్టిక్ గ్లాసులతో వీధులన్నీ నిండిపోతున్నాయి.

మూగజీవాలకు నష్టమే..

మార్కెట్లు, వ్యాపార సముదాయాలు, భోజన హోటళ్లు, టీ దుకాణాలు, చికెన్, చేపల మార్కెట్లు, చివరికి జ్యూస్ సెంటర్ల వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రజారోగ్యం దెబ్బతినడంతో పాటు మూగజీవాలకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలోని డ్రైనేజీలన్నీ ప్లాస్టిక్ కవర్లతో నిండిపోతున్నాయి. ఇకనైనా మునిసిపల్ అధికారులు ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిరోధించాలని పలువురు కోరుతున్నారు. వీటితో కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు

నక్కపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాలు శుక్రవారం కార్తీక పౌర్ణమి శోభతో కళకళలాడాయి.ఉదయం నుంచి గొడిచెర్ల శేష లింగేశ్వరస్వామి ఆలయం, ఉపమాక శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. ఉపమాక దేవస్థానం మాజీ ఛైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. అనంతరం ముక్కంటిని దర్శించుకున్నారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు మహేశ్, సంతోశ్ పూజలు చేశారు. పలువురు మహిళలు స్వామివారి పుష్కరిణిలో పుణ్యదీపాలు వెలిగించారు.

అయ్యప్ప స్వామి పడిపూజ

పాయకరావుపేట రూరల్: మండలంలోని సత్యవరం గ్రామంలో గురువారం రాత్రి అయ్యప్పస్వామి లక్ష బిల్వార్చన పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్ప స్వాములు, మహిళలు కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి పాలపర్తి సతీష్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. పాయకరావుపేట, తుని మండలాలనుంచి అయ్యప్ప స్వాములు, శివ స్వాములు పాల్గొన్నారు.



ఎస్ రాయవరంలో ధ్వజస్తంభం వద్ద పూజలు

ఎస్. రాయవరం: శివాలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో పలువురు మహిళలు ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం ఆలయాలను సందర్శించారు. అక్కడి ధ్వజస్తంభాల వద్ద దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ రాయవరం, గెడ్డపాలెం, సర్వసిద్ధి, దార్లపూడి, పెనుగొల్లు గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ఉపమాక శివాలయంలో భక్తులు రద్దీ



సత్యవరంలో అయ్యప్ప పడిపూజ చేస్తున్న దృశ్యం

కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



రామచంద్రపాలెంలో ఇంటింటి సర్వేచేస్తున్న వైద్య సిబ్బంది

కోటవురట్ల, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ముందు జాగ్రత్తలతో కేన్సర్ నియంత్రించవచ్చునని కే వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలో సుంకపూర్, రామచంద్రపాలెం గ్రామాల్లో ఇంటింటి సర్వేచేశారు. స్క్రీనింగ్ టెస్ట్‌లపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎఎన్ఎం ఆశ వర్కర్లు, ఎంపీహెచ్‌పీ వైద్యసిబ్బంది కలిసి 18 పైనగల ప్రతిఒక్కరికి ఉచితంగా కేన్సర్ వైద్యపరీక్షలు చేస్తున్నారన్నారు. నోటి, గర్భాశయం, ముఖద్వారం కేన్సర్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉచితంగా బీపీ, సుగర్, హెచ్‌బీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అవసరమైన వారికి మందులు అందిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు జె.సన్యాసమ్మ, ఎస్.మణి తదితరులు పాల్గొన్నారు.

18న కలెక్టరేట్ వద్ద

ఆశ కార్యకర్తల ధర్నా

అంతా తరలి రావాలని

జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతి పిలుపు

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తల సమస్యలపై ఈ నెల 18వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాకు తరలిరావాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతి పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రూప్ ఆఫ్ మినిస్ట్రీస్‌తో జరిగిన సమావేశంలో జరిగిన ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒప్పందంలోని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో సమస్యలపై ఆశ వర్కర్ల జాబ్‌చార్టును అమలు చేయాలని, సబ్ సెంటర్‌ల్లో డ్యూటీలు వేయడం ఆపాలని, సర్వే ఫారాలు అందరికీ అందించాలని తదితర డిమాండ్ల సాధనకు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా ప్రతినిధులు కె.వరలక్ష్మి, సూర్యలక్ష్మి, మంగ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సర్వకామదాంబకు ఆభరణాల అలంకరణ



అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని భోగలింగేశ్వరుని ఆలయంలో సర్వకామదాంబ అమ్మవారికి బంగారు ఆభరణాలను అలంకరించారు. బ్యాంక్‌లో భద్రపరిచిన ఆభరణాలను ఆలయ అధికారులు తీసుకువచ్చారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి అలంకరించారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

భోగలింగేశ్వర ఆలయ చైర్మన్‌గా 'కాండ్రేగుల'



కాండ్రేగుల సత్యనారాయణ

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం కోట మీద వెలసిన భోగలింగేశ్వరుని ఆలయ చైర్మన్‌గా కాండ్రేగుల సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ కమిటీ సభ్యులుగా మళ్ల సూరిబాబు, బి.నాగేశ్వరరావు, పెంటకోట గణేష్‌కుమార్, మద్దాల నారాయణరావు, దూలం సత్యవతి, రాపేటి నాగ సంతోష్‌లను నియమించారు. వీరికి నియామకపు పత్రాలను శుక్రవారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ అందజేశారు. చైర్మన్‌గా నియమితులైన సత్యనారాయణ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

నేటి నుంచి సత్యసాయి బాబా జయంత్యుత్సవాలు



విద్యుద్దీపాలంకరణలో సత్యసాయి ఆలయం

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం నిదానందొడ్డిలోని సత్యసాయి ఆల యంలో శనివారం బాబా జయంత్యుత్సవాలు ప్రారంభం కాను న్నాయి. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాన్ని విద్యుద్దీ పాలతో అలంకరించారు. ఈనెల 23వ తేదీ వరకు జరగనున్న ఈ వేడుకల్లో భాగంగా తొలిరోజు వేకువజామున ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన వంటివి నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ఓ ఇంటి ఆవరణలో పాత్రలో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో శుక్రవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డ్రై డేను నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించారు. జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. నీటిని ఎక్కువ రోజులు పాత్రల్లో నిల్వ ఉంచరాదని, దీనివల్ల ఆ నీటిలో దోమలు గుడ్లు పెట్టి లార్వా పెరగడంతో జ్వరాలకు కారణమవుతాయని వివరించారు. పలుచోట్ల ఇళ్ల ఆరు బయట పాత్రల్లో నిల్వ ఉంచిన నీటిని పారబోశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీధర్, ఎంఎల్‌హెచ్‌పీ బి.తేజస్వీ హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత భూములు పరిరక్షించకుంటే ఆందోళన

పరవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో గల తీర ప్రాంత భూములను పరిరక్షించేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలని బీజేపీ యువమోర్చ జిల్లా కార్యదర్శి మోస రామకృష్ణ శుక్రవారం ఇక్కడ కోరారు. తీర ప్రాంత భూముల కబ్జాకు పాల్పడుతున్న వారిని శిక్షించేలా సీఆర్‌జెడ్ యాక్ట్‌ను అమలు చేయాలన్నారు. అలాగే సీఆర్‌జెడ్ పరిధిలో గల భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు తీర ప్రాంత భూముల్లో పర్యటిస్తే అక్కడ జరిగే సంఘటనలు వెలుగులోకి వస్తాయని వివరించారు. తీరప్రాంత భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఆకట్టుకున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులు ప్రదర్శనలో ఉంచిన నమూనాలు

సబ్బవరం, నవంబరు 15 : ఇక్కడి ప్రతిభ విద్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. తొలుత ఈ కార్యక్రమాన్ని స్కూల్ కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ ప్రారంభించారు. అంతరిక్ష యానం, భూ కంపాలు, పర్యావరణం, గణితం, టెక్నాలజీ, గ్రామాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు, చెత్త నిర్వహణ తదితర అంశాలపై రూపొందించిన నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆన్సీజోసెఫ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దీపాంజలినగర్‌లో అంబేడ్కర్ విగ్రహం విష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీనవర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ విశేష కృషి చేశారన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ హెచ్‌ఆర్ విభాగం హెడ్ బీబీ పాత్ర, సీఅండ్ఎం విభాగం జీఎం వీటీ కాంబ్లే, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇదో మేజర్ పంఛాయతీ!

తుమ్మపాలను వీడని చెత్త సమస్య

- ఎక్కడికక్కడ కుప్పలు తెప్పలుగా రోజుల తరబడి దర్శనం
- అవస్థలు పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



తుమ్మపాల వీధిలో..



తుమ్మపాల శివాలయం వీధిలో పేరుకుపోయిన చెత్త

తుమ్మపాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అధికారుల అలసత్వం..., పారిశుధ్య సిబ్బంది కొరత... ఫలితంగా అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాలను చెత్త సమస్య వీడడం లేదు. ఎక్కడికక్కడ రోజుల తరబడి కుప్పలు పేరుకుపోతున్నా స్పందించేవారు కరువవుతున్నారు. ఈ పంచాయతీలో 18 వార్డులు ఉండగా, దాదాపు అన్ని చోట్ల ఇదే సమస్య వేధిస్తోంది. తుమ్మపాల మెయిన్ రోడ్డుతో పాటు ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పేరుకుపోయిన చెత్తలో పందుల స్వైర విహారం

ఈ ప్రాంతాల్లో మరీ దారుణం

ప్రధానంగా ఈ సమస్య తుమ్మపాల వీధి, గవరపేట వీధి, శివాలయం వీధి, తుమ్మపాల మెయిన్‌రోడ్డు, విద్యుత్ నగర్ తదితర ప్రాంతాల్లో అధికంగా ఉంది. ఇళ్లలో నివాసముంటున్న వారు చెత్తాచెదారాన్ని వీధుల్లో పారబోస్తుండడంతో అందులో పందులు, కుక్కలు చేరి చేరి వాతావరణాన్ని మరింత పాడుచేస్తున్నాయి. రోజుల తరబడి వీధుల్లో చెత్తనిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని అంటున్నారు. రాత్రివేళ దోమల బెడద అధికంగా ఉందని చెపుతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ఈ పంచాయతీలో దాదాపు 50 మంది వరకు పారిశుధ్య సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 24 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఈ సమస్యకు ఇదో ప్రధాన కారణంగా చెప్పవచ్చు. పారిశుధ్య సిబ్బంది ఒక వార్డులో విధులు నిర్వహించి మరో వార్డుకు రావాలంటే దాదాపు వారం రోజులు పడుతుంది. దీంతో ఆయా ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి.

దీర్ఘకాలంగా ఇదే సమస్య

దీర్ఘకాలంగా పంచాయతీని ఈ సమస్య వేధిస్తోందని అక్కడివారు ఆరోపిస్తున్నారు. రోజుల తరబడి చెత్త పేరుకుపోతున్నా ఇటు అధికారులు కానీ, అటు ప్రజాప్రతినిధులు కానీ సకాలంలో స్పందించలేకపోతున్నారని అంటున్నారు. కూటమి ప్రభుత్వమైన ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అంతా కోరుతున్నారు.

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



తుమ్మపాలలో చెత్త సమస్య శాశ్వత పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి. ప్రజల్లో అవగాహన లోపం కారణంగా ఎక్కడికక్కడ చెత్త వేస్తూ గ్రామాన్ని పాడు చేస్తున్నారు. దీనివల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించవంలో అధికారులు విఫలం కావడంతో ఈ సమస్య మరింత జటిలంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

- కర్రి బాబి, గ్రామ నాయకుడు, తుమ్మపాల

ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు



తుమ్మపాలలో చెత్త సమస్య పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తున్నాం. అలాగే గ్రామ పెద్దల సలహాలు, సూచనలు కూడా తీసుకుంటున్నాం. ప్రతి సచివాలయం పరిధిలో ఎనిమిది మంది పారిశుధ్య సిబ్బంది, చెత్త తరలింపు వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రతిరోజూ చెత్తను తొలగించేలా చర్యలు చేపడతాం. సిబ్బంది కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం.

- మళ్ల సత్య ప్రసాద్, ఈవో, తుమ్మపాల



గవరపేటవీ రోడ్డు మధ్యలో....

ఎటు చూసినా దీప కాంతులే

- వాడవాడలా కార్తీక పౌర్ణమి వేడుకలు
- ఇళ్లలో కేదారీశ్వర నోము
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు





భక్తులతో కిటకిటలాడుతున్న భోగలింగేశ్వరస్వామి ఆలయం.., కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో ధ్వజస్తంభం వద్ద మహిళల దీపారాధన



సబ్బవరం మండలం దేవీపురం దక్షవటిలో స్వామికి క్షీరాభిషేకం

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని ప్రజలంతా శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గృహిణులు వేకువనే లేచి తలంటు పోసుకుని, వివిధ రకాల పిండి వంటలను తయారు చేసి కేదారీశ్వరుని నోము నోచుకున్నారు. సాయంత్రం ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి పట్టణంలోని భోగలింగేశ్వర, సిద్ధిలింగేశ్వర, కాశీవిశ్వేశ్వర, ఉమారామలింగేశ్వర తదితర ఆలయాల్లో భక్తుల కోలహలం నెలకొంది. ధ్వజస్తంభాల వద్ద భక్తులు దీపారాధనను చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా ఏర్పాట్లను చేపట్టారు.

నేత్రపర్వంగా జ్వాలా తోరణం

కార్తీక పౌర్ణమి వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి పలు ఆలయాల్లో జ్వాలా తోరణాన్ని నిర్వహించారు. సిద్ధిలింగేశ్వర, కాశీవిశ్వేశ్వర, ఉమా రామలింగేశ్వర, భోగలింగేశ్వర ఆలయాల వద్ద అర్చకులు వేదమంత్రాల మధ్య జ్వాలా తోరణం జరిపారు. ఈ వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

పరవాడ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి శివాలయాల వద్ద భక్తులు బారులుతీరారు. పరవాడలో గల మల్లికార్జునస్వామి ఆలయంలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. దేశపాత్రునిపాలెం, స్వయంభూవరం, భరణికం, లేమర్తి, దీపాంజలినగర్ తదితర ప్రాంతాల్లో శైవక్షేత్రాల్లో పౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు.

ఇదిలావుంటే, పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాలను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అమ్మవారి ఉత్సవ విగ్రహంతో తెల్లవారుజామున నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పములు నిర్వహించారు. రేజేటి రామానాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో అమ్మవారికి కలశములతో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం ఆవరణలో అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షులు కటకం లక్ష్మణరావు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి అంబలం పూజ నిర్వహించారు. ప్రతిష్ఠ శత జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షులు బిక్కపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీదరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని దేవీపురం, పెదయాతపాలెం, లింగాల తిరుగుడు గ్రామాల్లో కార్తీక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవీపురంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ద్విసహస్ర లింగ పంచభూత లింగేశ్వర స్వామికి పూజలు, పెదయాతపాలెం గౌరీపరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయం ప్రాంగణంలో రుద్రాభిషేకాలు, విశేష హారతి అనంతరం 20 లక్షల మహాదీపార్చన వంటి వాటిని కన్నుల పండువుగా జరిపారు. ఈ కార్యక్రమాల్లో గురుపత్ని అన్నపూర్ణమ్మ, కందర్ప ప్రభాకర్, రమా, శరగడం శంకరరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



కొత్తూరులో సాయిబాబాను దర్శించుకుంటున్న రత్నాకర్ తదితరులు

తుమ్మపాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ పరిధిలో గల షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు బాబాకు పూజలు నిర్వహించారు. భజనలు, గీతాలాపనలు చేపట్టారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన ఏర్పాటైంది. కమిటీ సభ్యులు ఆళ్ల అప్పలనాయుడు, సీవీ లక్ష్మి, ఎంఎస్ఎన్ ప్రసాద్, ఆర్.రామ సత్యనారాయణ, అర్చకులు అరవిల్లి వెంకట దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం, నవంబరు 15 : ఆరిపాక చెరకు కాటా వద్ద గల షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన ఏర్పాటైంది. ఆలయ ధర్మకర్త మల్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, వైసీపీ నేతలు గండి రవికుమార్, కర్రి బాబు, మల్ల బాలాజీ, శరగడం వెంకటరావు, బీఎం నాయుడు, ఎస్‌పీ రాజు, బండారు రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి లోకేశ్ రాక?



విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ శనివారం సాయంత్రం విశాఖపట్నం వస్తున్నారు. వుడా పార్కు వెనుకనున్న ఏఎంజీ పార్కులో జరగనున్న ఓ వివాహానికి హాజరు కానున్నట్టు సమాచారం. అనంతరం తిరిగి విజయవాడ వెళతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఆంజనేయునికి కరెన్సీ నోట్ల అలంకరణ



కరెన్సీ నోట్ల అలంకరణలో అభయాంజనేయుడు

లంకెలపాలెం, నవంబరు 15 : ఇక్కడి జాతీయ రహదారిలోని మారుతి కూడలిలో కొలువై ఉన్న అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా స్వామివారి విగ్రహానికి రూ. మూడు లక్షలు విలువ చేసే కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మాదాసు వాసు, మడక రమేశ్‌నాయుడు, పచ్చికోరు రమణమూర్తి, సాలాపు వెంకటఅప్పారావు, మహేశ్, సాయి, వాసు, కోరుకొండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కాలపు జీతాలు విడుదల చేయండి

- డీఈవోను కోరిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

అనకాపల్లి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది డిసెంబరులో చేపట్టిన 21 రోజుల సమ్మె కాలపు జీతాలను వెంటనే విడుదల చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడును సమగ్రశిక్ష ఉద్యోగుల జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు కొప్పాకలోని డీఈవో కార్యాలయంలో శుక్రవారం ఆయనను కలిసి మాట్లాడారు. సమ్మె కాలపు జీతాల బిల్లు సంతకం చేసి బ్యాంకుకు పంపించినట్లు కమిటీ సభ్యులకు డీఈవో తెలిపారు.

మాజీ మంత్రి 'దాడి'ని కలిసిన 'ప్రగడ'



ప్రగడను సత్కరిస్తున్న మాజీ మంత్రి దాడి

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి దాడి వీరభద్రరావును రాష్ట్ర రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ప్రగడ నాగేశ్వరరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సంతబయలులోని దాడి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను దాడి వీర భద్రరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సత్కరించి అభినందించారు.

'ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపవద్దు'

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజల పాలిట భారంగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శుక్రవారం ఇక్కడ డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెట్టనున్నారని చెప్పారు. విద్యుత్ వినియోగదారుల అనుమతి లేకుండా నివాస గృహాలకు మీటర్లు బిగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. అలాగే ట్రూ ఆప్ చార్జీలను రద్దు చేయాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వినతి

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా శుక్రవారం గుండాలవీధి, లక్ష్మీదేవిపేట, గాంధీనగరం, రైల్వేస్టేషన్ రోడ్డులలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి, సమస్యలు తెలుసుకున్నారు. మురికి కాలువలను మెరుగుపరిచి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, కాళ్ల తేలయ్యబాబు తదితరులు మునిసిపల్ అధికారులను కోరారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. తొలుత ఈ ప్రదర్శనను సబ్‌జైలు పర్యవేక్షణాధికారి డి. అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంచే విలువైన పుస్తకాలను ప్రతి ఒక్కరూ చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ప్రోగ్రామ్ చైర్మన్ బల్లా నాగభూషణం మాట్లాడుతూ ఈ శాఖా గ్రంథాలయం 70 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు, ఇమ్మిడిశెట్టి చక్రపాణి, కొణతాల రామారావు, వీఎల్ఎన్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలని తుమ్మపాల నాయకులు ఆడారి గోవిందరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తుమ్మపాల శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంటూ పుస్తకాలకు దగ్గర కావడం ద్వారా విజ్ఞానాన్ని సంపాదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మంచి పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాభివృద్ధి పెంపొందించుకోవచ్చని పద్యకవి కాండ్రేగుల వెంకటరావు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పరవాడ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజూ పుస్తకాలు పఠించడం ద్వారా కొత్తకొత్త విషయాలను తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థుల ఎదుగుదలకు పుస్తక పఠనం చాలా ఉపయోగపడుతుందని వివరించారు. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ కె.వి.లక్ష్మణరావు, పాఠకులు నాగేశ్వరరావు, ప్రసాద్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : పుస్తక పఠనం ద్వారానే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించగలుగుతారని సబ్బవరం ఎస్ఐ టి.దివ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఇక్కడి శాఖా గ్రంథాలయంలో ఏర్పాటైన పుస్తక ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలను సందర్శించాలన్నారు. మొబైల్ ఫోన్లకు వీలైనంత వరకు దూరంగా ఉండాలన్నారు. గ్రంథాలయాధికారిణి వి.శిరీషా, ఉపాధ్యాయులు పాణి, ప్రసాద్‌లతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కర్రిగుడ, కడరేవ్‌లకు రోడ్డు సౌకర్యం కల్పించాలి



కలెక్టర్‌కు వినతి పత్రమిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

అనంతగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మ పంచాయతీ కర్రిగుడ, కడరేవ్ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు కలెక్టర్ దినేశ్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. పాడేరులోని శుక్రవారం కలెక్టర్‌ను కలిసి సమస్యలు వివరించారు. రహదారి సౌకర్యం లేక డోలీమోతలపై రోగులు, గర్భిణులను తరలించాల్సి వస్తోందని తెలిపారు. కొన్ని సందర్భాల్లో సకాలంలో వైద్యం అందక గిరిజనుల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు నెలల వ్యవధిలోనే ఇదే పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై కలెక్టర్ దినేశ్‌కుమార్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గిరిజనులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా అంబలం పూజ



పూజ చేస్తున్న అయ్యప్పస్వాములు

గూడెంకొత్తవీధి, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి) : గూడెంకొత్తవీధి మండలం ఆర్వీనగర్‌లో అయ్యప్పస్వామి మాలాధారణ భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో అంబలం పూజను నిర్వహించారు. స్థానిక అరికట అంజి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో గూడెంకొత్తవీధి , చింతపల్లి మండలాలకు చెందిన అయ్యప్పస్వాములు, గురుస్వాములు గంటా మురళి, ముక్కలి కామేశ్వరరావు, సరిమండ విజయ్, ఫైలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో అభివృద్ధి



మాట్లాడుతున్న సర్పంచి అర్జున్

డుంబ్రిగుడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి గ్రామసభలు వేదికగా నిలవాలని సర్పంచులు అర్జున్, వెంకటరావు, సుబ్బారావు, బీజేపి మండల కార్యదర్శి కేగాసి అన్నారు. కోర్రా, కితలంగి, పోతంగిల్లో గ్రామసభలు నిర్వహించారు. ముందుగా బిర్సాముండా చిత్రపటానికి నివాళులను అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గీత, విజయ ఈవోఆర్డీ విజయ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా పాంగి ధనుంజయ్

చింతపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యదర్శిగా పాంగి ధనుంజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన మండల కార్యదర్శిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధనుంజయ్ మూడోసారి మండల కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులుగా సాగిన చిరంజీవి, మర్రి నాగేంద్ర, సుందరరావు, కనకవల్లిలను ఎన్నుకున్నారు.



సీలేరులో శివాలయం ఎదుట భక్తులు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు



పాడేరులో హోమంలో పాల్గొన్న శివమాలధారులు

ఆలయాలకు కార్తీక పౌర్ణమి శోభ

- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- ప్రాంగణాల్లో దీపాల అలంకరణ

సీలేరు, నవంబరు 15 , (ఆంధ్రజ్యోతి) : సీలేరు, దారకొండల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీలేరులో మహిళా భక్తులు స్థానిక నదిలో తెల్లవారుజామున స్నానాలను ఆచరించి నదిలో దీపాలను వెలిగించారు. అనంతరం స్థానిక శివాలయం, మారెమ్మ ఆలయాలను సందర్శించి పూజలను చేశారు. ఈ సందర్భంగా శివాలయంలో పంచామృతాలతో అభిషేకాలను , ప్రత్యేక పూజలను నిర్వహించారు.కార్తీమ స్థానిక శివాలయంల ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక అలంకరణ చేసారు. ఆకాశదీపం వెలిగించిన అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులు అంతా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దీపాలను వెలిగించారు.

చింతపల్లి: మండలంలోని అంతర్ల, బౌడ శివాలయాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఉదయం నుంచి ఆలయాల ఎదుట బారులుతీరారు. చౌడలో అర్చకులు నాగేశ్ కుమార్ భక్తులతో ప్రత్యేక అభిషేకాలు చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం పల్లకిలో శివుని ఊరేగింపు, దీపారాధన నిర్వహించారు.

సంగంవలసలో అన్న సమారాధన

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయతీ సంగంవలసలో విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆర్థిక సహాయంతో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మండలంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు జేవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ గత మూడేళ్లుగా కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామంలో అన్న సమారాధన కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నొయిన, నరసింగరాంఉ, నీలకంఠం, నాయకులు అరబీరు జగబంధ, పద్మారావు, తిరుపతి, అప్పారావు, జయదేవ్ పాల్గొన్నారు.

పాడేరులో..

పాడేరురూరల్: పట్టణంలోని పురాతన శైవ క్షేత్రం ఉమానీలకంఠేశ్వర స్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి దంపతులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలను నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం, జ్వాలాతోరణం, శివ పార్వతుల పల్లకి సేవలో భాగంగా పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమాలను భక్తి శ్రద్ధతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సంహాచలం నాయుడు, చీపురు రమాదేవి, కొట్టగుళ్లి రామారావు, ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు పాల్గొన్నారు. అలాగే, స్వయం భూ గౌరీ నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివ మాలధారులు హోమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



సంగంవలసలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు: కలెక్టర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న పెద్దపెద్ద సంతలను గుర్తించి వాటికి కేటాయించిన స్థలాల్లోనే సంతలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు తగ్గే వీలుంటుందన్నారు.

ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్

ఇందులో భాగంగా శనివారం పాడేరులో ప్రధాన రహదారిలో ఆక్రమణలను తొలగించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం అరకులో ఆక్రమణలు తొలగించాలని పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులను కోరారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా, ఎంవీఐలు వాసు, రాజేష్‌కుమార్, ఆర్టీసీ డీఎం టి. ఉమామహేశ్వరరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ బి.బాల సుందరబాబు, డీసీహెచ్ఎస్. కె.కృష్ణారావు, జిల్లా ఆస్పత్రి మెడికల్ పర్యవేక్షకులు డాక్టర్.విశ్వమిత్ర తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌వో

హుకుంపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా ఆధ్వర్యంలో శుక్రవారం హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. చిన్నారుల ఎత్తు, బరువు నమోదు చేయడంతో పాటు పిల్లల ఆరోగ్యంపై క్షుణ్ణంగా పరిశీలించారు. అనారోగ్యంగా ఆసుపత్రులకు రిఫర్ చేస్తామన్నారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సాయి మోహన్‌రెడ్డి, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ వై.కిశోర్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ బి.ఎలీషారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యగెడ్డ వద్ద రూ. 4.5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం



నిర్మాణానికి శంకుస్థాపనలో ఇరడాపల్లి సర్పంచి అశ్విజ, తదితరులు

పాడేరురూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ బొక్కెళ్ల - ఈ కొత్తూరు గ్రామాల మధ్యనున్న మత్స్యగెడ్డ వద్ద వంతెన నిర్మాణం పూర్తయితే నాలుగు పంచాయతీల పరిధిలోని 60 గ్రామాల ప్రజలకు కష్టాలు తీరనున్నాయని ఇరడాపల్లి సర్పంచ్ గల్లెలి అశ్విజ అన్నారు. మత్స్యగెడ్డ కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 4.5 కోట్లు నిధులు మంజూరు కావడంతో శుక్రవారం ఆమె ఎంపీటీసీ సభ్యురాలు ముదిలి సుబ్బమ్మతో కలిసి ఆమె ఈ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారి సంతోష్, నాయకులు టి.వెంకటేశ్వర్లనాయుడు, గల్లెలి లింగమూర్తి, ఎం.సత్యనారాయణ, వార్డు సభ్యులు రామలింగం, సురేష్, అర్జున్, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పోసాని'పై టీడీపీ నాయకులు ఫిర్యాదు

పాడేరురూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు, రచయిత, వైసీపీ నాయకుడైన పోసాని కృష్ణ మురళిపై కేసు నమోదు చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక సీఐ డి.జీనబందుకు టీడీపీ నాయకులు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పాడేరు డివిజన్ నాయకులు దారెల గ్రామ సర్పంచ్ పి.పాండురంగ స్వామి మాట్లాడుతూ . అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయాలని కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై పోసాని అసభ్య రీతిలో మాట్లాడడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండిభ సర్పంచ్, టీఎన్ఎస్ఎఫ్ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు తామర్ల సత్యనారాయణ, ఎస్టీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు, శోబికోట సర్పంచ్ శశిభూషణ్ నాయుడు, జనసేన మహిళా నాయకురాలు దివ్య, పాతకోట మాజీ సర్పంచ్ రామలింగం, గంగరాజు పాల్గొన్నారు.

జలవిహారి వద్ద పార్కింగ్ ఫీజు వసూలు

డుంబ్రిగుడనవంబరు15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చాపరాయి జలవిహారి వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో పార్కింగ్ ఫీజు వసూలుకు ఐటీడీఏ పీవో అభిషేక్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఇన్‌చార్జి ఈవోఆర్డీ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నుంచి ఈ ఫీజు వసూలు అమలులోకి వచ్చినట్టు చెప్పారు. పర్యాటకులనుంచి వచ్చేఈ ఫీజుతో పంచాయతీ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. త్వరలోనే ఫీజు వసూలుకు టెండర్లకు పిలుస్తామన్నారు.

పీఎం జన్‌మన్ ఇళ్ల గ్రౌండ్ మేళా

గూడెంకొత్తవీధి: మండలం దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెంలో శుక్రవారం పీఎం జనమన్ పథకం ద్వారా మంజూరైన ఇళ్లకు మార్కింగ్ చేశారు. ఈ పంచాయతీ పరిధిలో 245 ఇళ్లు మంజూరు కాగా, మంగళపాలెంకు 16 కేటాయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరిబాల బుచ్చిబాబు, ఎంపీటీసీ పోతురాజు కృష్ణమూర్తి, హౌసింగ్ ఏఈ సూరిబాబు, వర్క్ ఇన్స్పెక్టర్ పడాల్, బీజేపీ, సీపీఎం నేతలు శేఖర్, జీ సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎన్‌క్యూఏఎస్ బృందానికి స్వాగతం పలుకుతున్న వైద్య సిబ్బంది

గిరిజనుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల (ఎన్‌క్యూఏఎస్) వైద్య బృందం వెల్లడి

డుంబ్రిగుడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):గిరిజన కుటుంబాల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా జాతీయ ఆరోగ్యా కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ పనిచేస్తోందని జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు (ఎన్‌క్యూఏఎస్) వైద్య బృందం సభ్యులు డాక్టర్ రాజేష్ కన్నా, డాక్టర్ సుశీల దత్తాత్రాయకవాడి స్పష్టం చేశారు. స్థానిక పీహెచ్‌సీని వారు సందర్శించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు గిరిజన సంప్రదాయమైన అడ్డాకుల గిడుగులతో వారికి పూలమాలలతో ఘనంగా స్వాగతించారు, ఆశ కార్యకర్తలు థింసా నృత్యాలతో అలరించారు. అనంతరం ఆసుపత్రిలో రోజువారి రోగుల వివరాలు, మందుల గదులు, ప్రసూతిగది, బాలింతలకు అందుతున్న వైద్యంపై క్షుణంగా పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వాహించారు. గ్రామ స్థాయిలో గిరిజనులకు అందుతున్న వైద్యం తీరుపై అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలకు బాలింతల సంరక్షణ, చిన్నారులకు టీకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డుంబ్రిగుడ, కిల్లోగుడ వైద్యాధికారులు రాంబాబు, నజీబ్, అంబిక, కుమార్‌రత్న, ఎంపీఈహెచ్‌వో శౌరి తదితరులు పాల్గొన్నారు.

కాఫీ పండ్లు కిలో రూ. 45 చొప్పున కొనుగోలు

- మాతోట ఎఫ్‌పీవో సీఈవో చిన్నారావు

చింతపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు పండించిన కాఫీ పండ్లకు కిలో రూ.45 చొప్పున గరిష్ఠ ధర చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక మాతోట రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీవో) సిఈవో వనపల చిన్నారావు తెలిపారు. శుక్రవారం మాతోట ఎఫ్‌పీవో డైరెక్టర్లు సమావేశమై అంతర్జాతీయ మార్కెట్ పరిగణలోకి కాఫీ ధరలను నిర్ణయించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ సారి కూడా కాఫీ పండ్లకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఎఫ్‌పీవో ప్రతినిధులు రైతుల గృహాల వద్దకు వచ్చి కాఫీ పండ్లను కొనుగోలు చేస్తారన్నారు. వెంటనే నగదు చెల్లిస్తామన్నారు. రైతులు కాఫీ పండ్లను చింతపల్లి ఎఫ్‌పీవో పల్పింగ్ యూనిట్ వద్దకు తీసుకు వచ్చి అందజేస్తే కిలో పండ్లకు రూ.50 ధర చెల్లిస్తామన్నారు. ఈ ఏడాది వెయ్యి టన్నుల కాఫీ గింజలు కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. కాఫీ చెర్రీ, పార్చిమెంట్ ధరలు నెలాఖరు నాటికి ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాతోట ఎఫ్‌పీవో ఛైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి



సినీనటుడు కృష్ణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అభిమానులు

పాడేరురూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు, దివంగత సూపర్ స్టార్ కృష్ణ రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలోని కృష్ణ, మహేశ్‌బాబు అభిమానులు శుక్రవారం నిర్వహించారు. కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. తమ అభి మాన నటుడు గొప్పతనాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంల అభిమానులు కొట్టగుళ్లి రామారావు, వియ్యపు అ ప్పలరాజు, వెయ్యాకుల సత్యనారాయణ, క్రత్రి సూర్యసింగ్ (శ్రీను), నూక అప్పారావు, బూరెడ్డి నాగేశ్వరరావు, శివరాత్రి శ్రీనివాస్‌కుమార్, డి.చినఅప్పలరాజు, వెంకటరమణ, సతీష్‌కుమార్, పచ్చ బుజ్జి, పి.రవీంద్ర, పి.గిరికుమార్, ఎ.జగదీష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

జి.మాడుగుల: ఆధ్యాత్మిక చింతనతోనే మనుస్సు ప్రశాంతంగా ఉంటుందని ఆధ్యాత్మిక వేత్త కొండవీటి జ్యోతిర్మయి తెలిపారు. మండలంలోని సింగర్బ పంచాయతీ మొండికోట చిద్గానందస్వామి ఆలయంలో శుక్రవారం అడవీ తల్లికి హారతిని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రకృతిపైనే సమస్త జీవరాసులు ఆధారపడి ఉంటాయని వివరించారు. అందువల్ల ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. అనంతరం గిరిజన దంపతులు సాగేని చినబాబు ఆచారి, పాంగి సూరిబాబు (చేపల్లి గ్రామం), కిముడు పొట్టచారి, కొండచారి, రమణమూర్తి, చిట్టిబాబు, కిముడు శ్రీనివాస్ చిన్నకృష్ణ చారి శివలింగ చారి తదితర జ్యోతిర్మయి దంపతులకు పాద సేవలు అందించారు. ఈ సందర్భంగా అన్నమయ్య కీర్తనలు, ప్రవచనాల ద్వారా ఆధ్యాత్మికతను వివరించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు పెట్టాలి:ఏటీడబ్ల్యూవో

చింతపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు పెట్టాలని స్థానిక ఏటీడబ్ల్యూవో బి. జయనాగలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం లోతుగెడ్డ బాలుర ఆశ్రమ పాఠశాలను ఏటీడబ్ల్యూవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ గది, రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాలను ఆమె రుచి చూశారు. పాఠశాల నిర్వాహణపై ఏటీడబ్ల్యూవో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్ఎం ఎస్వీ రమణ, డిప్యూటీ వార్డెన్ ఎస్. బాలకృష్ణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి



కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అరకులోయ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజున ప్రతీ విద్యార్థీ పదిమొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగసామ్యులు కావాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ సేవా పథకం పీవోలు ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాల్గొని మాట్లాడారు. పుట్టినరోజునమొక్కలు నాటితే పదికాలాల పాటు గుర్తుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనితకుమారి, నాగబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదబయలు: సీతగుంట పంచాయతీ సిబ్బంది శుక్రవారం పెదబయలులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిసరాలను శుభ్రం చేశారు. చెత్త చెదారాలను తొలగించి, ఆవరణలో కలుపు మొక్కలను తొలగించారు. వైద్యాధికారి నిఖిల్, మండల ఇన్‌చార్జి జేఈ శివరామయ్య, సర్పంచ్ మాధవరావు, కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని చుట్టుగొంది వాసుల ఆందోళన



శిథిల కల్వర్టు ఎదుట తమ సమస్యను తెలియజేస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని, దెబ్బతిన్న కల్వర్టు పునరుద్ధరణ పనులు చేపట్టాలని మండలంలోని మారుమూల బుంగాపుట్టు పంచాయతీ చుట్టుగొంది గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామానికి చెందిన వి.భాస్కరరావు, వి. లక్ష్మణ్, చైతాన్, హరిబాబు, కృష్ణారావు, మూర్తి, లోక్‌నాథ్ తమ కష్టాలను వివరించారు. బుంగాపుట్టునుంచి చుట్టుగొంది వరకు ఉన్నసుమారు ఐదుకిలోమీటర్లరహదారి అధ్వానంగా మారింది. గ్రామసమీపంలోని కల్వర్టు ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో పంచాయతీ కేంద్రం, మండల కేంద్రాలకు వెళ్లాలన్నా నరకయాతన అనుభవిస్తున్నామన్నారు.

ఇటుకల లారీ బోల్తా.. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

అనంతగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకు-విశాఖ ప్రధాన రహదారి వెంకయ్యపాలెం సమీపంలోని మలుపువద్ద ఇటుకల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఈఘటనలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.. స్థానికులందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. శుక్రవారం విశాఖ నుంచి ఒడిశాకు ఇటుకల లోడ్‌తో వెళ్తున్న లారీ వెంకయ్యపాలెం సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి బోల్తాపడింది.



బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన శోభ యాత్రలో విద్యార్థులు, నాయకులు



బిర్సాముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జీఎస్‌యూ నేతలు



బిర్సాముండా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు

బిర్సాముండా సేవలు చిరస్మరణీయం

- కలెక్టర్ దినేశ్‌కుమార్
- వాడవాడలా జయంతి ఉత్సవాలు

పాడేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పిన్న వయస్సులోనే ఆంగ్లేయులతో పోరాటం సాగించిన ఆదివాసీ యోధుడు బిర్సా ముండా అని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ కొనియాడారు. బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆంగ్లేయుల పాలనలో తీవ్ర అన్యాయానికి గురవుతున్న గిరిజనులను పక్షాన నిలిచి వారి హక్కులపై పోరాడిన ఘనత బిర్సాముండాకే దక్కుతుందన్నారు. కేవలం 22 ఏళ్ల వయస్సులోనే పోరాట యోధుడిగా చరిత్ర పుటల్లో స్థానం సంపాధించుకోవడం గర్వకారణమన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే. అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి పద్మలత, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఐసీడీఎస్ పీడీ ఎన్. సూర్యలక్ష్మి, ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఎల్.రజనీ, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ అరకులోయ ఈఈ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: బిర్సాముండా సేవలు చిరస్మరణీయమని దండకారణ్య ఉద్యోగుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోడా ఆనంద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ఐటీఐలో బిర్సాముండా 150 జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఇన్‌స్ట్రక్టర్లు బిర్సాముండా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బిర్సాముండా జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీవో కృష్ణవేణి, ఇన్‌స్ట్రక్టర్లు శ్రీనివాస్, సూపరింటెండెంట్ నానిబాబు, వార్డెన్ గిరిబాబు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: జీకేవీధి, రింతాడ, మొండిగెడ్డ, వంచుల పంచాయతీలో ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో బిర్సాముండా జయంతి వేడుకలను నిర్వహించారు. సర్పంచ్‌లు ప్రియాంక, కాసులమ్మ, బొబ్బొలి లక్ష్మి, కొర్రా సుభద్ర, కూటమి నాయకులు ముక్కలి రమేశ్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు నళిని, మాజీ సర్పం చ్ కొర్రా బలరామ్, కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

బిర్సాముండా జీవితం గిరిజన యువతకు ఆదర్శం

పాడేరురూరల్: గిరిజన స్వాతంత్ర్య సమర యోధుడు భగవాన్ బిర్సా ముండా జీవితం గిరిజన యువతకు ఆదర్శమని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.గోపాలపాత్రుడు అన్నారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా శుక్రవారం భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ సభ్యులు కిల్లు వెంకట రమేష్ నాయుడు, ఏబీవీపీ నాయకులు ఎంఎంఎల్ పాత్రుడు, సూర్యారావు, కళ్యాణ్, యోగి, నాగార్జున, కామరాజు, వెంకట్, శ్రీను, చిన్నబ్బాయి, సంజీవ్ దినేష్,ఎస్.వేమనబాబు, ఆర్ఎస్ఎస్ సభ్యులు పాంగి రామయ్య, ఎస్.సత్యనారాయణ,విద్యార్థులు పాల్గొన్నారు. గిరిజన విద్యార్థి సంఘం (జీఎస్‌యూ) ఆధ్వర్యంలో శుక్రవారం జీఎస్‌యూ లైబ్రరీ భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా బిర్సిముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర మాట్లాడుతూ బిర్సా ముండా పోరాట పటిమను నేటి గిరిజన యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎం.రాజబాబు, జేఏసీ మహిళా సభ్యురాలు వరలక్ష్మి, సత్యానందం, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు బుడిదే మాధవరావు, కిరసాని కిశోర్, పూజారి సురేష్‌కుమార్, బోయిని అనీల్, సోమేశ్, శివ, చందు, ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో

ముంచంగిపుట్టు: సుజనకోట పంచాయతీ సచివాలయంలో సర్పంచి వి.రమేశ్ బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సోమేశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలు: భగవాన్ బిర్సాముండా గిరిజనుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేశారని ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య అన్నారు. బిర్సిముండా 150 జయంతి జన జాతీయ దివాస్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. అరడకోటలో జరిగిన కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం పంచాయతీ కార్యాలయఆవరణలో మొక్కలు నాటారు. నీతి అయోగ్ ప్రతినిధి ప్రసన్న, అరడకోట సర్పంచ్ మత్స్యలింగం, వైస్ ఎంపీపీ రాజుబాబలున్నారు.

కొయ్యూరు : మండలంలోని రత్నంపేట పంచాయతీ బీజేపీ గిరిజన మోర్చా అధ్యక్షుడు అరిమెల రాజు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రీముల చందరరావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూకరాజు, భవానీ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఫారెస్ట్ నర్సరీని సందర్శించిన ఏపీసీసీఎఫ్

నర్సీపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలప డిపో ఆవరణలో సోషల్ ఫారెస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్లూరి వన నర్సరీని అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్‌పాండే శుక్రవారం సందర్శించారు. ఆయన వెంట విశాఖపట్నం కన్జర్వేటర్ మహ్మద్ దివాన్ మైదిన్, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్ ఉన్నారు. నర్సరీలో మొక్కలు వివరాలు, నిర్వహణ, విక్రయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచాలి

మాడుగుల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో అప్పారావు సూచించారు. శుక్రవారం జరిగిన బిర్సాముండా జన్మదిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సచివాలయాల ద్వారా అందించే సేవలపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 25 రకాల మౌలిక సదుపాయాలు

గ్రామాభియాన్‌కు ఎంపికైన ప్రాంతాల్లో అవకాశం

జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి నాగశిరీషా





గ్రామాభియాన్ సభలో మాట్లాడుతున్న జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి నాగశిరీషా... చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు

నాతవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్ పథకంలో ఎంపికైన గ్రామాల్లో 25 రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి నాగశిరీషా తెలిపారు. మండలంలోని సరుగుడు పంచాయతీ పరిధిలోని 16 గ్రామాల గిరిజనులతో శుక్రవారం ప్రత్యేక సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో బాగా వెనుకబడిన గిరిజన గ్రామాలను గుర్తించి జన్ జాతీయ అభియాన్ పథకాన్ని కేంద్రం అమలు చేస్తోందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలోని ఆరు మండలాల్లో పది గ్రామాల్లో ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగా సరుగుడు పంచాయతీలో వచ్చే మూడేళ్లలో అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని ఆమె తెలిపారు. సరుగుడు పంచాయతీ పరిధిలోని 16 గ్రామాలను పాడేరు ఐటీడీఏలో కలపాలని గిరిజనులు పోరాటాలు చేస్తున్నారని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని గిరిజన స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి, మాజీ ఎంపీ దుంపా మేరీ విజయకుమారీ సోదరుడు దుంపా వరప్రసాద్ జిల్లా గిరిజనాభివృద్ధి అధికారిని కోరారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కొండ మీద గిరిజన గ్రామాల్లో ఇనప విద్యుత్ స్తంభాలు తీసేసి సిమ్మెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కొందరు గిరిజనులకు ఇంకా పట్టాలు అందలేదని, సాగులో ఉన్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని విన్నవించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ సరుగుడు గిరిజన గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలకు పూర్తి చేయాలని కోరారు. పెసా అధ్యక్షులు నూకరత్నం మాట్లాడుతూ ఆధార్ కార్డులు లేక ఇంకా చాలా మంది గిరిజనులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. అనంతరం గిరిజన బాలికలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.వేణుగోపాల్, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి జె.ప్రశాంతి, ఎంపీడీవో బి.ఉషశ్రీ, సర్పంచ్ గంగరాజు, మాజీ సర్పంచ్ పట్టెం రాజుబాబు, టీడీపీ నేత చిన్నా, గిరిజన నేత బండి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

▸▸ నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ

కృష్ణాదేవిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ సూచించారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనుమానిత వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్లలో వచ్చే వీడియో, ఇతర మెసెజ్‌లపై అప్రమత్తంగా లేకపోతే సైబర్ క్రైమ్ నేరగాళ్ల పలు రకాలుగా మోసాలకు పాల్పడతారన్నారు. మరి కొందరు వీడియోలను మార్ఫింగ్ చేసి డబ్బులు గురించి బ్లాక్‌మెయిలింగ్ చేసే ప్రమాదం ఉందని, ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు భయపడకుండా సమీప పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై.తారకేశ్వరరావు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, అధ్యాపకులు శ్రీనివాస్, రమేష్, చిన్ని, గోవిందు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ

చోడవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయంతో పాటుపట్టణంలోని పలు దేవాలయాల వద్ద ఉన్న యాచకులకు స్థానిక రిటైర్డ్ ఎండీడీవో డి.నాగరాజు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే కొంత మందికి నగదు కూడా అందించారు.

నాటుసారా తయారు చేస్తే కేసులు

కె.కోటపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరువాడ గ్రామంలో నాటుసారా తయారీదారులకు, అమ్మకందారులకు ఎక్సైజ్ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. చోడవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కేవీ పాపునాయుడు నాటుసారా అమ్మకందారులను, తయారీదారులను సుమారు 25 మందిని గుర్తించారు. వీరితో సదస్సు ఏర్పాటు చేసి నాటుసారా అమ్మకం, తయారీ చేస్తే కేసులు పెట్టి జైలుకు పంపించి కఠినమైన శిక్షలు వేస్తామని హెచ్చరించారు. అలాగే నాటాసారా తాగడం వల్ల కలిగే అనర్థాలను గ్రామస్థులకు వివరించారు. నాటుసారా అమ్మకందారులను 25 మందిని కోటపాడు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఎంపీటీసీ సభ్యుడు అచ్చిబాబు, సర్పంచ్ సింగంపల్లి నారాయణమూర్తి, మహిళా పోలీసు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇద్దరు నాటుసారా తయారీదారులపై కేసు

రావికమతం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీడిమామిడి తోటల్లో నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రఘువర్మ తెలిపారు. మేడివాడ పంచాయతీ శివారు అప్పలమ్మపాలెంలో సారా తయారు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు శుక్రవారం సిబ్బందితో వెళ్లి దాడులు చేసి గ్రామానికి చెందిన గుడి రమణ, గేడి చెన్నాలను అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే సారా తయారీకి సిద్ధంగా ప్లాస్టిక్ డ్రమ్‌లలో ఉంచిన మూడు వేల లీటర్ల బెల్లపు పులుసును గుర్తించి అక్కడే ధ్వంసం చేయాలన్నారు. ప్లాస్టిక్ డ్రమ్‌లను కాల్చివేశామని ఎస్ఐ తెలిపారు.

పేదింటికి రూ.41 వేల ఆర్థిక సాయం

నర్సీపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శివపురంలోని ఒక పేద కుటుంబానికి ఎన్ఆర్ఐ వాసవీ క్లబ్ ద్వారా ఆర్థిక సహాయం అందించారు. గొల్లపూడి పెద్దన్నశెట్టి భార్య సావిత్రి క్యాన్సర్ కారణంగా మరణించింది. ఆమె వైద్యానికి అధికంగా ఖర్చు కావడంతో కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఈ విషయాన్ని వెలగా నారాయణరావు ద్వారా అమెరికాలోని ఎన్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ ప్రతినిధులకు తెలిపారు. మొదటి విడతగా పెద్దన్నశెట్టి కుటుంబానికి రూ.41,500 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పైల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'దేశీ హితమే బీజేపీ లక్ష్యం'

కె.కోటపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ హితమే బీజేపీ లక్ష్యమని, ఆ దిశగా పనిచేయడమే కార్యకర్తల ముఖ్య లక్షణమని పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక గౌరీ పరమేశ్వర సామాజిక భవనంలో శుక్రవారం సాయంత్రం బీజేపీ క్రియాశీల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే క్రియాశీల కార్యకర్తల సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మేడపురెడ్డి శ్రీనివాస్, నాయకులు బండారు రామస్వామిపాత్రుడు, శరగడం సన్యాసినాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైలా అమ్మాజీ, కె. నూరిదేముడు, జనపరెడ్డి సూర్యనారాయణ, సన్యాసిరావు, కుమార అప్పారావు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు

గొలుగొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నాతవరం, గొలుగొండ మండలాల్లో బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ మధుకుమార్ తెలిపారు. ఈ దాడుల్లో గొలుగొండ మండలంలోని ఏఎల్.పురంలో పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, నాగం నూకినాయుడుపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

నర్సీపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఇక్కడి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. జూనియర్ కళాశాల లెక్చరర్ జి.చిన్నారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆధ్యాత్మిక గ్రంథాలు, జీకే, ఆరోగ్య సంబంధిత పుస్తకాలు, క్రీడలు, కథల పుస్తకాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి దమయంతి పాల్గొన్నారు.

చోడవరంలో...

చోడవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు బాలలు అనేక మంది హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలను విద్యార్థులు చదివారు. ఈ సందర్భంగా బీసీ హాస్టల్ వెల్ఫేర్ అధికారి జె.నారాయణమూర్తి పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జి.తిరుమలకుమారి, స్థానిక నేత కర్రి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పైసా వసూల్‌పై చర్యలకు రంగం సిద్ధం

▸▸ కొంత మందిపై కలెక్టర్‌కు నివేదిక?

మాకవరపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయ ఉద్యోగుల్లో గుబులు రేగుతోంది. 'పైసా వసూల్' పేరిట ఈ నెల 10వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ స్పందించారు. ఈ మేరకు గుట్టుగా విచారణ చేస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ భూములతో పాటు జగనన్న కాలనీల్లోనూ ఇష్టారాజ్యంగా తపుడు సంతకాలతో ఎల్‌పీసీలు మంజూరు చేసిన కొందరు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించినట్టు తెలిసింది. ఇటీవల ఒక వీఆర్‌వో రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ప్రచురితమైన 'ఆంధ్రజ్యోతి' కథనంపై తహసీల్దార్ రామారావు ఆరా తీస్తున్నట్టు సమాచారం. దీంతో అక్రమాలకు పాల్పడ్డ ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు.



గవర కార్పొరేషన్ డైరెక్టర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

కష్టపడే కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించిన టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్‌ను గురువారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన గంగాధర్‌కు చంద్రబాబునాయుడు నామినేటెడ్ పదవి ఇవ్వడం సముచితంగా ఉందన్నారు. గంగాధర్ గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవికి మరింత వన్నె తేవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదవి రావడానికి కృషిచేసిన ఎమ్మెల్యే రాజుకు గంగాధర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లునాయుడు, పెదబాబు, సకురు కోటేశ్వరరావు పాల్గొన్నారు. డైరెక్టర్‌గా నియమితులైన గంగాధర్‌ను విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, ఎంపీటీసీ సభ్యులు పాలెం నాయుడు, చిన్న, పార్టీ పట్టణ నేతలు దేవరపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీను, బుచ్చెయ్యపేట మండల నేత గోకివాడ కోటేశ్వరరావు తదితరులు ఘనంగా సత్కరించారు.

ఘనంగా సామూహిక వ్రతాలు



చినపాచిల దేవాలయంలో సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

రావికమతం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా చినపాచిల శ్రీలక్ష్మీసత్యనారాయణ కోదండ రామాలయంలో శుక్రవారం సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అరవెల్లి వాసుదేవాచార్యులు, వెంకట రామగోపాలాచార్యులు, పవన్ కుమార్ ఆధ్వర్యంలో వంద మంది దంపతులతో వైభవంగా కార్యక్రమం జరిగింది. ఏటా ఈ దేవాలయలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ వ్రతాలను అన్నవరం సత్యదేవుని ఆలయంలో మాదిరిగానే నిర్వహిస్తుంటారు. చినపాచిల గ్రామంతో పాటు కొమిర, మత్స్యపురం, కేబీపీ అగ్రహారం, జేడి పేట, రాజమండ్రి, రావికమతం తదితర గ్రామాల నుంచి భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకట రామగోపాలాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

త్రిశూల పర్వతంపై అఖండ జ్యోతి



అఖండ జ్యోతిని సిద్ధం చేసిన భక్తులు.. అఖండ జ్యోతిని వెలిగించిన దృశ్యం

నర్సీపట్నం, నవంబరు 15 (ఆంధ్రజోతి): పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన రోజు కార్తీక పౌర్ణమి సందర్భంగా బలిఘట్టం త్రిశూల పర్వతంపై అఖండ జ్యోతిని వెలిగించారు. ఈ పర్వతానికి అభిముఖంగా శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో స్ఫటిక లింగం రూపంలో ఉన్న శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కృత్తిక నక్షత్రం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల సహాయ సహకారంతో 150 కిలోల నెయ్యిని ఉపయోగించి అఖండ జ్యోతిని వెలిగించారు. శివయ్య భక్తులు, అయ్యప్పస్వాములు అఖండ జ్యోతిని దర్శించుకొని తరించారు.

రీ సర్వే సభలను వినియోగించుకోండి



భూ రీ సర్వే సభలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

కె.కోటపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వే సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేశ్ సూచించారు. మండలంలోని పైడంపేట గ్రామంలో శుక్రవారం రీ సర్వే సభ నిర్వహించారు. గ్రామంలో భూ సమస్యలపై 16 వినతిపత్రాలు అందాయి. వీటిని అధికారులు పరిశీలించిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. మండల సర్వేయర్ కె.రామచంద్రమూర్తి, సర్వేయర్ జగదీశ్, సర్పంచ్ రొంగలి రాఘవనాయుడు పాల్గొన్నారు.

తప్పులను ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

▸▸ మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి, వైసీపీ నేతలు ధర్మశ్రీ తదితరులు

చోడవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తప్పులను ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు సూపర్‌సిక్స్ పేరుతో కుచ్చుటోపీ పెట్టిందని, దీన్ని ప్రశ్నించేవారు లేకుండా సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నదని ఆరోపించారు. తమ ప్రభుత్వంపై అప్పులు ముద్రవేసి ప్రజలను తప్పుదారి పట్టించిన కూటమి నేతలు, ప్రస్తుతం చేస్తున్నదేమిటో ప్రజలకు వివరణ ఇవ్వాలని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నాయకులను వేధించడం మినహా కూటమి ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని ఎద్దేవా చేశారు. కార్యకర్తలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

అక్రమ అరెస్టులకు భయపడేది లేదు: ధర్మశ్రీ

కూటమి వైఫల్యాలను ప్రశ్నించే వారిపై పెడుతున్న కేసులు, అక్రమ అరెస్టులకు భయపడేది లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ స్పష్టం చేశారు. కేసులతో ప్రశ్నించేవారి గొంతులు నొక్కే ప్రయత్నాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు అధైర్యపడొద్దని, వారికి పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, నాయకులు ఏడువాక సత్యారావు, శ్రీకాంత్, వెంపలి ఆనంద్, బొడ్డేడ సూర్యనారాయణ, గాడి అప్పారావు, వేచలపు ప్రకాశ్, సూరిసెట్టి నాగదుర్గ గోవింద్, నెహ్రూ, పందిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బిర్సా ముండాకు జోహార్లు అర్పిస్తున్న గిరిజన ఉద్యోగులు సంఘం నాయకులు

ఘనంగా బిర్సా ముండా జయంతి

నర్సీపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో తలుపులు మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, స్వేచ్ఛ, భూమి, భుక్తి కోసం ముండా అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన పోరాట పటిమను ఆదర్శంగా తీసుకొని హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎస్.ధర్మరాజు, నాయకులు డి.దేముల్లు, జి.పంతులు బాబు, ఎం.లింగమూర్తి, పి.లక్ష్మణమూర్తి, నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.


దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి పంచాయతీలో బిర్సా ముండా జయంతి ఘనంగా నిర్వహించారు. గిరిజన సమాజానికి ఆయన చేసిన సేవలను ఎంపీడీవో సువర్ణరాజు, ఉపాధ్యాయుడు శ్రీను స్మరించుకున్నారు. జన జాతీయ గౌరవ దివస్‌ను ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు గ్రామ సభ నిర్వహించారు. అనంతరం బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోడమ్మ, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో...

చీడికాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల హక్కుల సాధన కోసం బిసా ముండా చేసిన పోరాటాలు అమోఘమని ఎంపీడీవో హేమసుంద్రరావు అన్నారు. బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా కోనా పంచాయతీ కార్యాలయంలో గిరిజన కుటుంబాలు, ఉద్యోగులతో శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి పోరాడిన ముండా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి కామేశ్వరరావు, వైస్ ఎంపీపీ కిముడు చిన్నమ్మ, నాయకులు సత్యవతి, సలుగు అప్పల నాయుడు, పంచాయతీ కార్యదర్శులు సన్యాసిరావు, సింహాచలంనాయుడు, వనిత వరహామూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాశీ యాత్రలో టీడీపీ కార్యకర్త మృతి



వెంకటరాజు (ఫైల్)

రోలుగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన ఎ.వెంకటరాజు (59) కాశీ దైవ దర్శనానికి వెళ్లి శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. బంధువులు అందించిన వివరాల ప్రకారం... వెంటరాజుతో పాటు మరో 20 మంది పది రోజుల క్రితం కాశీకి దైవదర్శనం నిమిత్తం వెళ్లారు. కాశీ, రామేశ్వరం యాత్రలు ముగించుకుని శుక్రవారం స్వగ్రామానికి బయలు దేరడానికి సిద్ధమయ్యే సమయంలో వెంకటరాజుకు గుండె నొప్పి వచ్చి మరణించాడు. ఇటీవలే గ్రామంలో ఎమ్మెల్యే రాజు సభ్యత్వ నమోదు ప్రారంభించగా, తొలి సభ్యత్వాన్ని వెంకటరాజు తీసుకున్నారు. ఆయన ఆకస్మిక మరణం తీరని లోటని మాజీ సర్పంచ్ రొంగలి వెంటరమణ తెలిపారు. వెంకటరాజు అంత్యక్రియలు అక్కడే నిర్వహించినట్టు తెలిపారు.

రెవెన్యూ సదస్సులో 18 అర్జీలు

రోలుగుంట, నవంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 17 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ నాగమ్మ తెలిపారు. వివిధ రెవెన్యూ సమస్యలకు సంబంధించి ఈ అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి, ఉప సర్పంచ్ బంటు చిరంజీవి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కదిలిన అధికారులు



ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రావికమతం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట మేజర్ పంచాయతీలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కదిలారు. స్టేట్ బ్యాంకు ఎదురుగా అయ్యప్ప నగర్‌లో బీబీఎన్ రోడ్డును ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో గ్రామానికి చెందిన దొడ్డి అప్పారావు కబ్జా చేసి షాపు నిర్మాణంపై అయ్యప్పనగర్ కాలనీ వాసులు పంచాయతీ, రెవెన్యూ అధికారులతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం సర్పంచ్ కోన లోవరాజు, ఎంపీటీసీ సభ్యులు పూడిదేవా, పంచాయతీ ఈవో జ్యోతిశ్వరరెడ్డి, వీఆర్‌వో సుబ్బయ్య కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ఆపై సర్వే చేయించగా ఇది 127/2 సర్వే నంబరులో ప్రభుత్వ స్థలమని గుర్తించారు. దీంతో అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. త్వరలో కొత్తకోటలో అక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి, బాధ్యులతపై తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఈవో జ్యోతిశ్వరరెడ్డి స్పష్టం చేశారు.

అగ్ని ప్రమాదంలో పశువుల పాకలు దగ్ధం



కాలిపోయి బూడిదైన పశువుల పాకలు

మాడుగుల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజేపురం నుంచి దబ్బగుంట వెళ్లే మార్గంలో కేజేపురం గ్రామానికి చెందిన ఎల్లపు పెంటయ్య, బలరామస్వామిలకు చెందిన రెండు తాటాకు పశువుల పాకలు శుక్రవారం వేకువజామున అగ్నిప్రమాదంలో కాలిపోయాయి. గురువారం సాయంత్రం పశువుల పాక ముందు ఉన్న ప్రదేశంలో పొయ్యి పెట్టి పశువులకు దానా ఉడకబెట్టి మంట ఆర్పేసి ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో శుక్రవారం వేకువజామున మంటలు అంటుకున్నాయి. చుట్టు పక్కల రైతులు గమనించి ఈ విషయాన్ని వారికి తెలియజేశారు. మాడుగుల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికే రెండు తాటాకు పాకలు కాలిపోయాయి. సుమారు రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధిత రైతులు వాపోయారు. ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు ప్రమాద స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధిత రైతులు గోకులం షెడ్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేయడంతో, జరిగిన విషయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందిస్తూ బాధిత రైతులకు తగిన న్యాయం చేద్దామని భరోసా ఇచ్చినట్టు ఎంపీటీసీ శ్రీనివాసరావు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం కావాలి

రోలుగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల సన్నాహాలపై కూటమి నాయకులు స్థానిక పాలకేంద్రం వద్ద శుక్రవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎంతో ప్రాధాన్యత నీటి సంఘం కలిగిన కొమరవోలు ఆవకు సంబంధించి కొమరవోలు, కన్నంపేట, పడాలపాలెం, జె.నాయుడుపాలెం, కొండపాలెం, రోలుగుంట, తూటిపాల, జగ్గంపేట గ్రామాలకు చెందిన రైతులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు చంద్రమౌళి సూచించారు. ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధంగా ఉండాలని, నోటిఫికేషన్ విడుదలైన వెంటనే రైతులతో సమావేశం నిర్వహించి కూటమికే మద్దతు తెలిపేలా క్షేత్రస్థాయిలో రూపకల్పన చేయాలని సూచించారు. అనంతరం కొమరవోలు ఆవ నీటి సంఘం సంబంధించి పరిధిలో ఉన్న రైతుల ఓటర్ల జాబితాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, బోడాపాత్రుని నరేశ్, ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు ధరలు తగ్గించాలని ధర్నా



అధిక ధరలపై నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

మాడుగుల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కార్లి భవాని, ఇరట నరసింహమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరకుల ధరలు భారీగా పెరిగిపోయాయని, దీని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కూటమి నాయకులు ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఈ ప్రభుత్వం కూడా ధరలను అదుపు చేయలేకపోతున్నదని మండిపడ్డారు. ధరలు భారీగా పెరిగిపోతే కూటమి నాయకులు చూస్తూ ఎలా ఊరుకున్నారని ప్రశ్నించారు. పెరిగిన ధరల కారణంగా పేద ప్రజలు, మధ్యతరగతి కుటుంబాల వారు తీవ్ర అవస్థలు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కింతలి రమాదేవికి లిఖితపూర్వకంగా వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొర్రా చెనరాజు, చెదల కృష్ణ, ఈశ్వర్రావు, రాజుబాబు పాల్గొన్నారు.

పిక్నిక్‌కు వెళదాం పదండి..

జిల్లాలో ఎన్నో అద్భుత సందర్శనీయ ప్రదేశాలు

మదిని దోచే సముద్ర తీరాలు

కార్తీక మాసంలో వనభోజనాలకు సందడే సందడి

కార్తీకమాసంలో వన భోజనం సంప్రదాయం. బంధువులు, మిత్రులతో కార్తీక వన సమారాధనలకు అందరూ ప్రణాళిక వేసుకుంటారు. జిల్లాలో ఎన్నో ఎన్నో అందమైన, సందర్శనీయమైన ప్రాంతాలు ఉన్నాయి. అన్ని వయస్సుల వారినీ అలరించే సాగర తీరాలు, జలపాతాలు, జలాశయాలు, ఉద్యానవనాలు వున్నాయి. ఆయా ప్రాంతాలకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వెళ్లి, వనభోజనాలు, ఆటపాటలతో ఎంచక్కా ఎంజాయ్ చేసి రావచ్చు. జిల్లాలో కొన్ని ముఖ్యమైన పిక్నిక్ స్పాట్‌లపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక సమాచారం.



కొండకర్ల ఆవ

సుందర దృశ్యాల సమాహారం

అచ్యుతాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం మండలం పారిశ్రామికంగానే కాకుండా పర్యాటకంగా కూడా ఎంతో గుర్తింపు పొందింది. పూడిమడక, వాడపాలెం సముద్ర తీరాలు, కొండకర్ల ఆవ ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ప్రసిద్ధి చెందాయి. కార్తీకమాసంతోపాటు వారాతంపు రోజుల్లో కూడా ఈ ప్రదేశాలకు పర్యాటకు అధిక సంఖ్యలో వసుంటారు. ఆయా ప్రదేశాల్లో వున్న ప్రత్యేకతలు, ఎలా చేరుకోవాలో తెలుసుకుందాం...

వాడపాలెం తీరం: తంతడి పంచాయతీ పరిధిలో సముద్ర తీరంలో వుంది. ప్రకృతి అందాలకు నిలయం. కార్తీకమాసంతోపాటు వారాంతపు రోజుల్లో కూడా జనం ఇక్కడకు వస్తుంటారు. సినిమా షూటింగులు ఎక్కువగా జరుగుతుంటాయి. అయితే ఇక్కడ తీరంలోనే సముద్రం చాలా లోతుగా, అలల తాకిడి ఎక్కువగా వుంటుంది. నీటిలో దిగడం క్షేమం కాదు. గాజువాక వైపు నుంచి వచ్చేవారు పరవాడ దాటిన తర్వాత ఊటగెడ్డ జంక్షన్ నుంచి ఎన్‌టీపీసీ, వాడచీపురుపల్లి, తంతడి మీదుగా వెళ్లాలి. ఎలమంచిలి, అచ్యుతాపురం వైపు నుంచి అయితే మడుతూరు జంక్షన్ నుంచి దోసూరు మీదుగా వాడపాలెం వెళ్లవచ్చు.



వాడపాలెం తీరంలో పర్యాటకుల సందడి

పూడిమడక: ఇక్కడ సముద్ర తీరం చాలా విశాలంగా, లోతు తక్కువగా వుంటుంది. కార్తీకమాసం, మాఘపౌర్ణమి, శివరాత్రి, తదితర పర్వదినాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడకు వచ్చి సాగరంలో పుణ్యస్నానాలు చేస్తుంటారు. జాలారిపాలెం వద్ద లైట్‌హౌస్, ఉప్పుటేరు సముద్రంలో కలిసే ప్రదేశాలు చూడదగ్గవి. కార్తీక మాసం పిక్నిక్ స్పాట్‌లలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. పూడిమడక-సీతపాలెం మధ్య ఉప్పుటేరు వుంది. ఇక్కడ రెండు కొండలు... వాటిని తాకే సముద్రపు అలలు ఎంతో ఆహ్లాదభరితంగా వుంటుంది. వనభోజనాలకు అనువైన ప్రదేశం. అచ్యుతాపురం జంక్షన్ నుంచి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో పూడిమడక వుంది. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు నడుస్తుంటాయి.

కొండకర్ల ఆవ: దీనినే వాడ్రాపల్లి ఆవ అని కూడా అంటారు. ఇది ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద మంచినీటి సరస్సు. కార్తీక మాసం నుంచి సంక్రాంతి వరకు పర్యాటకులు అధికంగా వస్తుంటారు. ఆవలో విహరించడానికి తాటి దోనెలు, ఫైబర్ బోట్లు వున్నాయి. విరబూసిన కలువ పువ్వులు ఆవకు మరింత అందాన్ని చేకూరుస్తుంటాయి. వాడ్రాపల్లిలో దక్షిణేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇక్కడ శివలింగం స్ఫటికంతో ఉంటుంది. కొండపైన వెంకటరమణమూర్తి ఆలయం వుంది. ఈ కొండపైకి ఎక్కితే వాడ్రాపల్లి ఆవ అందాలు మరింత బాగా కనిపిస్తాయి. కొండపైకి ఎక్కడానికి దారి కూడా వుంది.

వాడ్రాపల్లి/కొండకర్ల ఆవకు నేరుగా బస్సు సౌకర్యం లేదు. అనకాపల్లి నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వున్న మునగపాక చేరుకోవాలి. ఆర్టీసీ బస్సులు, ఆటోలు వుంటాయి. ఇక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్న వాడ్రాపల్లి ఆవకు ఆటోల్లో వెళ్లాలి. విశాఖ నుంచి ఆర్టీసీ బస్సుల్లో వచ్చే వారు అచ్యుతాపురం జంక్షన్ చేరుకోవాలి. ఇక్కడి నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో హరిపాలెం సినిమాహాలు జంక్షన్ నుంచి కొండకర్ల గ్రామం మీదుగా ఆవకు వెళ్లవచ్చు. ప్రైవేటు వాహనాల్లో అయితే గాజువాక-అచ్యుతాపురం రహదారిలో సానికాలు నుంచి చీమలాపల్లి మీదుగా వెళ్లవచ్చు. ఇదే రహదారిలో మడుతూరు జంక్షన్ నుంచి బంగారయ్యపాలెం, కొండకర్ల పాత అతిథిగృహం మీదుగా కూడా వెళ్లవచ్చు.



సముద్ర తీరంలో ఉన్న జెట్టీ

తాండవ రిజర్వాయర్, సరుగుడు జలపాతం

నాతవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాండవ జలాశయం, సరుగుడు జలపాతం కార్తీకమాసంలో వనభోజనాలకు ఎంతో బాగుంటాయి. తాండవ రిజర్వాయర్ అందాలు సందర్శకుల మదినిదోచేస్తాయి. రెండు కొండలను కలుపుతూ నిర్మించిన ఆనకట్ట మీద నుంచి జలాశయం అందాలను ఆస్వాదించవచ్చు. ఆనకట్ట దిగువన నల్లగొండమ్మతల్లి, అంజనేయస్వామి ఆలయాలు, పార్కు వున్నాయి. పార్కులో ఉల్లాసంగా గడుపుతూ వనభోజనాలు చేయవచ్చు. తాండవ జలాశయం వద్దకు వెళ్లాలంటే నర్సీపట్నం నుంచి తాండవ జంక్షన్, నాతవరం మీదుగా తాండవ వరకు బస్సులు వున్నాయి. ఇక్కడి నుంచి సుమారు కిలోమీటరు దూరం నడిచివెళితే జలాశయం వద్దకు చేరుకోవచ్చు. సొంతవాహనాల్లో కూడా వెళ్లవచ్చు.



ఎత్తు నుంచి జాలువారుతున్న సరుగుడు జలపాతం

నాతవరం మండలంలో తుని- నర్సీపట్నం రోడ్డులోని తాండవ జంక్షన్ నుంచి 22 కిలోమీటర్ల దూరంలో సరుగుడు జలపాతం వుంది. కార్తీకమాసంలోనే కాకుండా ఏడాది పొడవునా జలపాతం సందర్శనకు పర్యాటకులు వస్తుంటారు. నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి రెండు గంటలకు ఒక బస్సు సర్వీసు వుంది. తుని-నర్సీపట్నం రూట్‌లో తాండవ జంక్షన్ నుంచి ప్రైవేటు వాహనాలు కూడా నడుస్తుంటాయి.



నిండుకుండలా తాండవ రిజర్వాయర్ (ఇన్‌సెట్‌లో) పూల మొక్కలతో ఆకట్టుకుంటున్న తాండవ గట్టు

అందాల తీరం.. పదండి పోదాం.... రేవుపోలవరం

ఎస్.రాయవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సముద్ర తీరంలో అత్యంత అందమైన, ఆధ్యాత్మిక ప్రదేశం రేవుపోలవరం. ఎస్.రాయవరం మండలంలో వున్న ఈ ప్రదేశానికి కార్తీకమాసంలోనే కాకుండా ఏడాది పొడవునా ఇక్కడకు పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడ సాగర తీరం అర్ధ చంద్రాకారం మాదిరిగా వంపు తిరిగి, చాలా అద్భుతంగా వుంటుంది. సమీపంలో వున్న గుట్టపైకి ఎక్కి చూస్తే.... ఒకవైపు నీలి సముద్రం, మరోవైపు పుడమికి ఆకుపచ్చని చీరకట్టినట్టు కొబ్బరి తోటలు కనిపిస్తాయి. వనభోజనాలు చేయడానికి కొబ్బరి తోటలు ఎంతో అనువుగా వున్నాయి. వనభోజనాలు చేయడానికి కొబ్బరి తోటలు ఎంతో అనువుగా వున్నాయి. ఇక్కడ ఒక కొండపై లక్ష్మీ మాధవస్వామి ఆలయం, మరో కొండపై శివపార్వతుల విగ్రహాలు, సమీపంలో షిర్డీ సాయిబాబా ఆలయాలు వున్నాయి.



కొండపై లక్ష్మీమాధవస్వామి ఆలయం



రేవుపోలవరం వద్ద సముద్రతీరం

ఎలా వెళ్లాలి....

జాతీయ రహదారిపై అడ్డరోడ్డు జంక్షన్ నుంచి తూర్పు దిశగా పది కిలోమీటర్ల దూరంలో రేవుపోలవం వుంది. ఆర్టీసీ బస్సు సదుపాయం లేదు. అడ్డరోడ్డు నుంచి ఆటో వుంటాయి. సొంత వాహనాల్లో కూడా చేరుకోవచ్చు. అయితే ఇక్కడ నీరు, ఆహార పదార్థాలు లభించవు కాబట్టి వచ్చేటప్పుడు వెంట తెచ్చుకోవడం మంచిది. మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

డీఎస్సీ అభ్యర్థుల శిక్షణకు ప్రత్యేక ఫ్యాకల్టీ

» పోస్టుల కోసం పీజీ, బీఈడీ విద్యార్హులు

18లోగా దరఖాస్తు చేసుకోవాలి

అనకాపల్లి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఫ్యాకల్టీని నియమిస్తున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కె.రాజేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం పీజీ, బీఈడీ పూర్తిచేసిన వారు ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ కులాలకు చెందిన డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. వీరికి శిక్షణ ఇవ్వడానికి బీఈడీ, పీజీ విద్యార్హతలు కలిగిన అనుభవజ్ఞులైన వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఇంటి నంబరు 10-06-31/7, రఘురామకాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కాలేజీ స్ట్రీట్, అనకాపల్లి, అనకాపల్లి జిల్లా చిరునామాలోని కార్యాలయానికి ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 8247036596, 9885845743లలో సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

మిస్సింగ్ కేసులను ఛేదించండి: ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ కేసులను సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల అధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులను త్వరితగతిన ఛేదించాలని, వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం డీఎస్పీలు శ్రావణి, సత్యనారాయణ, మోహన్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

ఎమ్మెల్యేల లిక్కర్ దందా!

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాదికారులు సంబంధిత నియోజకవర్గంలో పనిచేస్తున్న ఎక్సైజ్ సీఐలకు వివరించినట్టు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో వ్యాపారులను పిలిచి ఉన్నతాధికారుల ప్రతిపాదనను వారికి వివరించాలని సీఐలు భావిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని మరో నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధి మద్యం వ్యాపారంలో స్లీపింగ్ పార్టనర్‌గా చేరాలనే ఉద్దేశంతో ఉన్నారు. ప్రతి దుకాణంలో తనకు వాటా ఇవ్వాలని, ఆ మేరకు లైసెన్స్ ఫీజును ఇచ్చేస్తానని వ్యాపారులకు ప్రతిపాదించినట్టు ప్రచారం జరుగుతోంది. గుడ్‌విల్, అధికారులకు ఇచ్చే ఫార్మాలిటీలను తాను ఇచ్చుకోలేనని కేవలం లైసెన్స్ ఫీజులో వాటాను మాత్రమే చెల్లిస్తానని చెప్పడంతో వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. మరొక ప్రజా ప్రతినిధి తన నియోజకవర్గంలో నోటిఫై చేసిన దుకాణాలకు లైసెన్స్‌లను జారీచేసేముందు తన దృష్టిలో పెట్టాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది. తనను కలిసి ప్రసన్నం చేసుకున్న వారికి మాత్రమే లైసెన్స్‌లు జారీచేయాలని అధికారులకు సూచిస్తున్నారని, కలవని వారికి దుకాణాలు దొరకకుండా చేయడంతోపాటు ఎక్కడైనా ఏర్పాటుచేసుకున్నాసరే లైసెన్స్ జారీ కాకుండా ఇబ్బందిపెడుతున్నారని కొంతమంది వ్యాపారులు చెబుతున్నారు. సదరు ప్రజా ప్రతినిధి ఇబ్బంది పడలేకే రూ.ఐదు లక్షలు ఖర్చుపెట్టి దుకాణం ప్రారంభించిన వ్యాపారి ఒకరు...పది రోజుల తర్వాత బీచ్‌రోడ్డులోకి దుకాణాన్ని మార్చుకున్నారంటున్నారు. నగరంలోని ప్రజా ప్రతినిధి ఒకరు తన నియోజకవర్గ పరిధిలో నోటిఫైడ్ దుకాణాలను లాటరీలో దక్కించుకున్నవారి నుంచి మూడింటిని స్వాధీనం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆ మూడు దుకాణాలు ఏర్పాటుచేసిన ప్రాంతాల్లో మరో నాలుగు దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అందుకు లైసెన్స్ ఇవ్వకుండా తనకు అస్మదీయుడైన కీలక అధికారి ద్వారా చక్రం తిప్పారంటున్నారు. ప్రజా ప్రతినిధుల మెప్పు కోసం కొంతమంది ఎక్సైజ్ అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వ్యాపారులు లబోదిబోమంటున్నారు. నగరానికి చెందిన మరొక ప్రజా ప్రతినిధికి సన్నిహితుడైన ప్రముఖ మద్యం వ్యాపారి ఒకరు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో కార్పొరేట్ స్టైల్‌లో దుకాణం ఏర్పాటుచేస్తున్నారు. దుకాణం మొదటి అంతస్తులో ఉండడంతో పైకి ఎక్కేందుకు రోడ్డువైపు నుంచి మెట్లు లేకపోవడంతో ఫుట్‌పాత్‌ను ఆక్రమించేసి మరీ ర్యాంపు నిర్మించేస్తున్నారు. జీవీఎంసీ, పోలీస్ అధికారులను అటు వైపు చూడొద్దని సదరు ప్రజా ప్రతినిధి ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది. కమర్షియల్ భవనంలో మాత్రమే అలాంటి దుకాణం ఏర్పాటుచేయాలని, అయితే నివాసానికి ప్లాన్ కలిగిన భవనంలో ఏర్పాటుచేస్తున్నాసరే అధికారులు లైసెన్స్ మంజూరుచేయడం విడ్డూరంగా ఉందని అంటున్నారు.

ఇంటింటా సౌర వెలుగులు

... 5వ పేజీ తరువాయి

కిలోవాట్, 150 యూనిట్లకు పైబడి 300 యూనిట్లకు లోపు విద్యుత్ వినియోగించే వారికి రెండు కిలోవాట్స్, 300 యూనిట్లకంటే ఎక్కువ విద్యుత్ వినియోగించే వారికి మూడు కిలోవాట్స్ సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్లు అవసరం అవుతాయి. మూడు కన్నా ఎక్కువ కిలోవాట్స్ సామర్థ్యం వున్న సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నప్పటికీ గరిష్ఠంగా రూ.78 వేలు మాత్రమే ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుంది.

రిజిస్ట్రేషన్...

పీఎం సూర్యఘర్ యోజన కింద ఇంటి పైకప్పుపై సౌర విద్యుత్ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలనుకొనేవారు ఏపీ ఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. తొలుత తమ పేరును పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆప్షన్ ఎంచుకుని ఏపీఈపీడీసీఎల్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి. లాగిన్ అయ్యాక రూఫ్‌టాప్ సోలార్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. యూనిట్ ఏర్పాటుకు అనుమతి ఆన్‌లైన్‌లో రాగానే నమోదిత సోలార్ వెండర్స్ నుంచి సోలార్ యూనిట్‌ను పొందవచ్చు. సోలార్ ప్లేట్ల అమరిక పూర్తయిన తరువాత నెట్ మీటరు అమర్చుతారు. తరువాత ఈపీడీసీఎల్ అధికారులు తనిఖీ చేసి ధ్రువీకరిస్తారు. అనంతరం బ్యాంకు ఖాతా వివరాలు అందిస్తే, నెల రోజుల్లో లబ్ధిదారుని బ్యాంకు ఖతాలో రాయితీ సొమ్ము జమ అవుతుంది.

మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం

పీఎం సూర్యఘర్ యోజనతో మధ్య తరగతి కుటుంబాలకు మేలు జరుగుతుంది. సోలార్ రూఫ్ టాప్ పరికరాలకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. మిగిలిన సొమ్మును బ్యాంకుల నుంచి రుణంగా పొందవచ్చు. పీఎం సూర్యఘర పథకం వివరాలు తెలుసుకోవాలనుకొనేవారు మండల అభివృద్ధి అధికారి లేదా ఈపీడీసీఎల్ మండల అధికారులను సంప్రదించాలి.

నిరంతర ప్రక్రియ

జి.ప్రసాద్, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్, అనకాపల్లి



పీఎం సూర్యఘర్ పథకానికి దరఖాస్తు చేయడానికి గడువు అంటూ ఏమీ లేదు. జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయ్యింది. కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించాం. శుక్రవారం నాటికి 1,852 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ అయ్యాయి వీటిలో 197 యూనిట్లను ఇప్పటికే ఏర్పాటు చేశాం.

వీవోఏ అవినీతి లెక్క తేల్చేశారు!

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. మూడు గ్రూపులకు సంబంధించి 11 లక్షల 32 వేల రూపాయలు దారి మళ్లినట్టు ప్రాథమికంగా నిర్ధారించినట్టు సమాచారం. కాగా ఈ వ్యవహారంలో తప్పు తనదేనని, ఆ సొమ్మును తాను చెల్లిస్తానని వీవోఏ వరలక్ష్మి, అధికారుల ముందు అంగీకరించినట్టు చెబుతున్నారు. కాగా డ్వాక్రా సభ్యుల సొమ్మును వీవోఏ వరలక్ష్మి తన సొంతానికి వాడుకోవడం వెలుగు సీసీ తాతబాబుకు తెలిసే జరిగిందని అధికారుల విచారణ సందర్భంగా బయటపడినట్టు సమాచారం. ప్రాథమిక విచారణ మేరకు వెలుగు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధమైనట్టు తెలిసింది.

క్రైం... crime news

ఏలేరు కాలువలో వివాహిత మృతి

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తుమ్మపాల సమీపంలోని ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ ఓ వివాహిత పడి మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం అయితంపూడి గ్రామానికి చెందిన పిళ్లా సూర్యభవాని (35) కొద్ది రోజులుగా పిల్లల చదువు నిమిత్తం తుమ్మపాల ఇందిరా కాలనీలో తమ్ముడు వెంకట సాయి జనార్ధన్ ఇంటిలో ఉంటున్నట్టు చెప్పారు. బుధవారం రాత్రి ఇంటిలో నుంచి బయటకు వెళ్లిన సూర్యభవాని జాడ తెలియకపోవడంతో గురువారం వీఆర్వో వెంకటసాయి జనార్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. బొజ్జన్నకొండకు వెళ్లే మార్గంలోని ఏలేరు కాలువలో శుక్రవారం సూర్యభవాని మృతదేహం లభ్యమైనట్టు వీఆర్వో సమాచారం ఇచ్చారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఏలేరు కాలువలో సూర్యభవాని ప్రమాదవశాత్తూ జారి పడిపోయి ఉండొచ్చనని భావిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గెడ్డపాలెంలో చోరీ

» మూడున్నర తులాల బంగారు ఆభరణాల అపహరణ

ఎస్.రాయవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెడ్డపాలెం గ్రామంలో చోరీ జరిగింది. కర్రి శాంతికుమార్ ఇంటిలో మూడున్నర తులాల బంగారు వస్తువులను ఆగంతుకులు దోచుకుపోయారు. ఈ చోరీకి సంబంధించి ఎస్ఐ విభీషణరావు శుక్రవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. గెడ్డపాలెం గ్రామానికి చెందిన శాంతికుమార్ బంధువు ఒకరు ఈ నెల 9న మృతి చెందారు. అయితే తన ఇంటి పేరుకు చెందిన బంధువు మరణించడంతో పెద్దకర్మ అయ్యేవరకు ఇంటిలోకి వెళ్లకూడదనే ఉద్దేశంతో శాంతికుమార్ కుటుంబ సభ్యులు బయట హాలులోనే ఉంటున్నారు. తన ఇంటిని శుభ్రం చేయాలని సమీప బంధువు వెంకట నాగదుర్గకు శాంతికుమార్ సూచించారు. శుక్రవారం ఆమె లోపలకు వెళ్లగా వస్తువులు చిందరవందరగా ఉండడంతో విషయాన్ని తెలిపారు. దీంతో శాంతికమార్ వెళ్లి పరిశీలించగా మూడున్నర తులాల బంగారు వస్తువులు కనిపించకుండా పోవడంపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలతో పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



గెడ్డపాలెంలో చోరీ జరిగిన ఇంటిలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

యువతి అదృశ్యంపై కేసు నమోదు

గొలుగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట మండలం కంచుగోమల గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. మండలంలోని అమ్మపేట గ్రామంలో తమ ఇంటికి గత నెల 27వ తేదీన బయలుదేరిందని, ఇంటికి చేరలేదని యువతి అమ్మమ్మ శుక్రవారం చేసిన ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

19న స్కూల్ గేమ్స్ థాంగ్ టా, బీచ్ వాలీబాల్ పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-14, 17 జిల్లా స్థాయి థాంగ్ టా, బీచ్ వాలీబాల్ పోటీలు కమ్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి దేవుడు తెలిపారు. ఈ నెల 19న పాడేరు తలార్‌సింగ్‌లోని జీటీడబ్ల్యుఏ స్కూల్‌లో థాంగ్ టా, ఆర్కే బీచ్‌లో బీచ్ వాలీబాల్ జట్టు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు థాంగ్ టా గేమ్‌కు సంబంధించి ఫోన్: 94411 05964, బీచ్ వాలీబాల్ కోసం ఫోన్:98858 68988లలో సంప్రదించాలన్నారు.